
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



ఏలూరు
జిల్లా వార్తలు
5
శుక్రవారం 15 మార్చి 2024

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 38.0
కనిష్ఠం : 23.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:20 (శుక్ర)
సహరి : 4:49 (శని)



భీమడోలులో గన్ని దంపతుల మద్దతు కోరుతున్న జనసేన అభ్యర్థి ధర్మరాజు

పదవులు కాదు.. పార్టీ ముఖ్యం

టీడీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని

భీమడోలు, మార్చి 14 : 'పదవులు కాదు.. పార్టీ ముఖ్యం. కొట్టినా, తిట్టినా తెలుగుదేశం పార్టీలోనే ఉంటా. రాష్ట్రంలో ధృతరాష్ట్ర పాలన అంతమొందించి రాష్ట్రాభివృద్ధికి పాటుపడే చంద్రబాబును సీఎంగా చూడడమే మా లక్ష్యం. అందుకు పొత్తు ధర్మాన్ని పాటిస్తాం. ఉంగుటూరును గెలిపించి చంద్రబాబు ముందు ఉంచుతాం' అంటూ ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు స్పష్టం చేశారు. భీమడోలు గన్ని క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గన్ని మాట్లాడుతూ.. 'కార్యకర్తలు, నాయకులు ఎటువంటి ఆవేశాలకు పోవద్దు. ఆవేశపూరితమైన నిర్ణయాలు తీసుకోవద్దు. రాష్ట్ర అభివృద్ధికి టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు కుదుర్చుకున్న నేపథ్యంలో చంద్రబాబును సీఎం చేసే విధంగా కలిసికట్టుగా పొత్తు ధర్మాన్ని పాటించాలి. ఉంగుటూరు సీటును జనసేనకు కేటాయించడంతో అందరం కలిసికట్టుగా ఈ నియోజకవర్గాన్ని గెలిపించాలి'.. అని కేడర్‌కు పిలుపునిచ్చారు. ఆయన సోదరుడు నాగగోపాలరావు మాట్లాడుతూ అనేక కష్టనష్టాలకు ఓర్చి నియోజకవర్గంలో పార్టీ కేడర్ నిలబడి ఉందని, వారికి భరోసా ఇచ్చేలా చర్యలు చేపట్టాలని గన్నిని కోరారు. నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కూటమి కదనోత్సాహం!

సీట్లు ఖరారు, అభ్యర్థుల ప్రకటనలో దూకుడు

- 12 స్థానాలు ఖరారు.. పోలవరం, కైకలూరు అసెంబ్లీ స్థానాలు పెండింగ్..
- పశ్చిమ గోదావరి జిల్లా స్థానాల్లో గెలుపు గుర్రాలు సంసిద్ధం
- కొన్ని చోట్ల సెగలూ, పొగలూ
- బీజేపీలోనూ అసంతృప్తితో ఆత్మీయ సదస్సులు
- పదో రత్నంగా వలసలకు వైసీపీ ప్రేరేపణ

నరసాపురం, ఏలూరు పార్లమెంట్ నియోజక వర్గాల పరిధిలోని 14 అసెంబ్లీ స్థానాలకు గాను 12 చోట్ల ఉమ్మడి కూటమి అభ్యర్థులు ఖరారయ్యారు. పొత్తులో భాగంగా ఏలూరు పరిధిలోని కైకలూరు స్థానంలో బీజేపీ, పోలవరంలో జనసేన తమ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించాల్సి వుంది. ఎంపీల స్థానంలో ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఎన్నికల నోటిఫికేషన్ ఏ క్షణమైనా విడుదల అయ్యేందుకు అవకాశం ఉండడంతో ప్రధాన పక్షాలన్నీ ఇప్పటికే జాబితాల రూపకల్పన, నియోజకవర్గాల వారీగా బలా బలాలను బేరీజు వేసే పనిలో పడ్డాయి. కొందరి అసంతృప్తులు ఆత్మీయ సమావేశాలకు, వ్యక్తిగత భేటీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇంకొందరు భవిష్యత్ కార్యాచరణకు తేదీలు ప్రకటిస్తున్నారు.

(ఏలూరు – ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

మూడు పార్టీల ఉమ్మడి పొత్తులో భాగంగా దెందులూరు అభ్యర్థిగా మాజీ ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్‌ను తెలుగుదేశం గురువారం ప్రకటించింది. రెండు నెలలుగా సాగిన ప్రచారానికి తెరపడింది. టీడీపీ అధికారికంగా గురువారం ఆయన పేరును ప్రకటించడంతో నియోజకవర్గంతోపాటు ఏలూరులో కార్యకర్తలు వెంట రాగా చింతమనేని ర్యాలీ నిర్వహించారు. ప్రభాకర్‌పై అభిమానులు పూలజల్లులు కురిపించారు. కార్యకర్తల కృషితో ఈ సారి భారీ మెజారిటీతో గెలుపు ఖాయమని చింతమనేని ధీమా వ్యక్తం చేశారు.

ఏలూరు జిల్లాలో జనసేనకు కేటాయించిన పోలవరంపై ఆ పార్టీ అభ్యర్థిని ప్రకటించాల్సి వుంది. ఇప్పటికే జనసేన పక్షాన చిర్రి బాలరాజు నియోజకవర్గంలో శ్రమిస్తున్నారు. మరికొందరు తమకూ అవకాశం ఇవ్వాలని పార్టీకి దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారం అభ్యర్థిని ప్రకటించే అవకాశం ఉంది. కైకలూరు స్థానాన్ని బీజేపీకి కేటాయించినా ఆ స్థానం నుంచి అభ్యర్థిని అధికారికంగా ప్రకటించలేదు. ఇప్పటికే కామినేని శ్రీనివాస్ ఈ స్థానాన్ని ఆశిస్తున్నారు. అయి తే రాష్ట్రవ్యాప్తంగా తమ పార్టీకి కేటాయించిన అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల కూర్పు పూర్తి కాలేదు. ఎంపిక ఒక కొలిక్కి వచ్చి జాబితాను జాతీయ పార్టీ ఆమోదానికి పంపాల్సి ఉంది. ఈ కారణంగా బీజేపీ అభ్యర్థుల జాబితా ఈ నెల 17 తర్వాతే వెలువడ గలదని భావిస్తున్నారు. ఏలూరు లోక్‌సభా స్థానం పరిధిలో ఏలూరు, చింతలపూడి, నూజివీడు, దెందులూరు నియోజకవర్గాలు నాలుగింటిలో తెలుగు దేశం అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించారు. మిగతా మూడింటిలో ఉంగుటూరులో జనసేన అభ్యర్థిని ప్రకటించారు. మరో రెండు స్థానాల్లో మిత్రపక్షాలు తమ అభ్యర్థులను ప్రకటించాల్సి వుంది.

నరసాపురం లోక్‌సభా స్థానం పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాలలో పాలకొల్లు, ఆచంట, ఉండి, తణుకుల్లో తెలుగుదేశం అభ్యర్థులను ప్రకటించారు. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాల్లో జనసేన అభ్యర్థులను ఇప్పటికే ప్రకటించడంతో ఈ లోక్‌సభ స్థానం పరిధిలో కూటమి అభ్యర్థులంతా రంగంలోకి దిగినట్లయింది. ఎటు తిరిగి ఒకవైపు పొత్తు ధర్మం కొనసాగిస్తూనే మరోవైపు గెలుపు కోసం కార్యకర్తలు బాధ్యతను భుజాన వేసుకుంటున్నారు.

అక్కడక్కడా సెగలూ.. పొగలు

కూటమి పక్షాన అభ్యర్థులను ప్రకటించిన తర్వాత అక్కడక్కడా సెగలు పొగలు వెలువడుతూనే వున్నాయి. ప్రత్యక్షంగా లోక్‌సభా స్థానాలకు అభ్యర్థుల ప్రకటనలో కూటమి తగు సమయం తీసుకుంటోంది. ఏలూరు లోక్‌సభ స్థానం బీజేపీకి కేటాయించాలని కోరుతూ ఏలూరులో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ స్థానాన్ని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తపనచౌదరి ఆశిస్తున్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు ఈ సమావేశానికి హాజరయ్యేలా జాగ్రత్తపడుతున్నారు. వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా టీడీపీ, జనసేనతో కలిసి నడిచేందుకు బీజేపీ సిద్ధపడడం, ఆ తర్వాత సీట్ల కేటాయింపు చకచకా సాగింది. అయితే ఏలూరులోనే తొలిసారిగా కమలంలో కొంత కల్లోలం చోటు చేసుకుంది. దీనిని సర్దుబాటు చేసేందుకు రాష్ట్ర నాయకత్వం ఇప్పటికే పలుమార్లు తపన చౌదరితోపాటు మిగతా నాయకులతోనూ సంప్రదింపులకు ప్రయత్నించింది. అయినా శుక్రవారం తలపెట్టిన ఆత్మీయ సదస్సు కొనసాగుతుందని, దీన్ని వాయిదా వేసే ప్రశ్నే లేదని కమలదళం భీష్మించింది. ఏలూరు, నరసాపురం ఎంపీ స్థానాలపై తుది నిర్ణయం వెలువడడానికి రెండ్రోజులు పట్టే అవకాశాలున్నాయి. ఉండి సీటును ఆశించి భంగపడ్డ టీడీపీ మాజీ ఎమ్మెల్యే శివరామరాజు భవిష్యత్ కార్యక్రమాన్ని శనివారం లోపు వెల్లడిస్తానని ప్రకటించారు. టీడీపీపై పూర్తి అసంతృప్తితో వున్న ఆయన, పార్టీ సంప్రదిస్తుందని గడచిన పక్షం రోజులుగా వేచి వున్నానని, ఆ వైపు నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో సీరియస్ చర్యలవైపే తను మొగ్గు చూపబోతున్నట్లు శివరామరాజు తేల్చి చెప్పారు. ఇంకోవైపు నరసాపురంలో మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు తాజాగా గురువారం మొగల్తూరు మండలం ముత్యాలంపల్లిలో కీలక ప్రకటన చేశారు. ఎవరూ ఊహించని విధంగా తాను కూడా భవిష్యత్ కార్యక్రమాన్ని ప్రకటించబోతున్నట్లు, అది కూడా రాబోయే రెండు, మూడు రోజుల్లోనేనని మాధవనాయుడు స్పష్టం చేయడం సంచలనం సృష్టించింది. ఈ మధ్యనే జనసేనలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు ముఖ్య అనుచరులతో చర్చిస్తున్నట్లు సమాచారం. పార్టీకి కట్టుబడి వుంటూనే, పార్టీ రక్షణకు వీలుగా ఆయన తదుపరి నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు. మొత్తం మీద పొత్తు సాగిన మిగతా నియోజకవర్గాల్లో ఉమ్మడి కార్యాచరణకు మూడుపార్టీల కార్యకర్తలు ఇప్పటికే తెరలేపారు. ఏలూరు నియోజకవర్గంలో వైసీపీ నుంచి భారీగా వలసలు టీడీపీలోకి సాగుతున్నాయి. ఏలూరు కార్పొరేషన్ కీలకం కాబట్టి ఈ ప్రాంతం నుంచే వైసీపీ ముఖ్యులు, కార్పొరేటర్లు టీడీపీ బాట పట్టారు. దెందులూరు నియోజకవర్గంలో కూడా చింతమనేని సమక్షంలోనే వైసీపీ కార్యకర్తలు అనేక మంది టీడీపీలో చేరారు. చింతలపూడిలోనూ పార్టీ అభ్యర్థి రోషన్‌కుమార్‌కు క్షణం తీరిక లేకుండా ప్రజలతో మమేకం అవుతున్నారు. పొత్తులో ఉంగుటూరు నుంచి టికెట్ సాధించిన జనసేన అభ్యర్థి పచ్చమట్ల ధర్మరాజు నేరుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఉంగుటూరు నుంచే సీటు ఆశించిన గన్ని వీరాంజనేయులు నివాసానికి వెళ్ళి ఆయన ఆశీర్వాదం తీసుకోవడం, తన క్యాంప్ కార్యాలయంలో టీడీపీ సమావేశం గురువారం నిర్వహించడమే కాకుండా ఉమ్మడి అభ్యర్థి ధర్మరాజు గెలుపుకు అందరూ సహకరించాలని గన్ని పిలుపునివ్వడం కలిసొచ్చే అంశంగా భావిస్తున్నారు.

వైసీపీలో ఇలా

వైసీపీ ఇప్పటికే నవరత్నాల పేరిట ఈ ఎన్నికల్లో ఓటు బ్యాంకు నిలుపుకునేందుకు రకరకాల ఎత్తుగడలు వేస్తోంది. పదో రత్నంగా వివిధ పార్టీల నుంచి వచ్చేలా ముఖ్యులను ఆకర్ష పేరిట ఎర వేస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ పై అసంతృప్తిగా ఉన్నవారిని సాధ్యమైనంత మేర తన పార్టీలోకి రప్పించుకునేలా ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తాడేపల్లిగూడెం నుంచి మాజీ ఎమ్మెల్యే ఈలి నానిని వైసీపీలోకి ముఖ్యమంత్రి జగనే స్వయంగా ఆహ్వానించి కండువా కప్పారు. ఈలి నాని తరహాలోనే మిగతా నియోజకవర్గాల్లో ముఖ్యులు ఎవరైనా అసంతృప్తి ఆగ్రహంగా ఉంటే అటువంటి వారిని ఆకర్షించే పనిలో పడింది.



ఎన్టీఆర్‌కు చింతమనేని నివాళులు



టీడీపీ అధినేత చంద్రబాబును కలసిన వలవల బాబ్జి

బాబ్జికి బాబు భరోసా

భీమవరం, మార్చి 14(ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జితోపాటు నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు మంగళగిరిలో గురువారం పార్టీ అధినేత చంద్రబాబుతో భేటీ అయ్యారు. తాడేపల్లిగూడెం సీటును జనసేనకు కేటాయించడంతో టీడీపీ ఇన్‌చార్జి బాబ్జికి చంద్రబాబును కలిసేందుకు ఆహ్వానం వచ్చింది. నియోజకవర్గాన్ని నెంబర్-1 స్థానంలో నిలబెట్టారంటూ చంద్రబాబు గుర్తుచేశారు. ఇదే తరహాలో ముందు ముందు కేడర్‌ను చెక్కు చెదరకుండా చూడాలని, పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. తాడేపల్లిగూడెం రాజకీయ పరిస్థితులను పలువురు నాయకులు అధినేత దృష్టికి తీసుకువెళ్ళారు. రాజకీయంగా రాబోయే కాలంలో ఎదురయ్యే పరిస్థితులను వివరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జితోపాటు కేడర్‌కు ప్రభుత్వ, పార్టీపరంగా గుర్తింపు ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. బాబ్జి బాధ్యతను మరింత పెంచుతామని అన్నారు. మరోవైపు నియోజకవర్గ కూటమి అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌కు పార్టీ అండగా నిలుస్తామని బాబ్జి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్ళారు.

గూడెం వైసీపీ టిక్కెట్ ఎవరికి ?

సీఎం సమక్షంలో పార్టీలో చేరిన నాని

భీమవరం, మార్చి 14 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం అధికార వైసీపీ నుంచి ఈ సారి బరిలో నిలిచేది ఎవరు ? ఆ పార్టీ శ్రేణుల్లో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది. ఎందుకంటే మాజీ ఎమ్మెల్యే ఈలి నాని గురువారం సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైసీపీలోకి చేరారు. దీంతో టిక్కెట్ ఎవరికి ఇస్తారన్న విషయం ఆసక్తిగా మారింది. మంత్రి కొట్టు సత్యనారాయణకు నియోజకవర్గంలో వ్యతిరేకత ఉందని, అందుకే ఆయనకు టిక్కెట్ నిరాకరిస్తారని కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. అందుకే ఇప్పటి వరకు మంత్రికి అధిష్టానం ఎలాంటి హామీ ఇవ్వలేదని చెబుతున్నారు. పార్టీ శ్రేణుల్లోనూ టిక్కెట్ విషయంపై స్పష్టత లేదు. ఈ నేపథ్యంలోనే నాని వైసీపీలోకి చేరారు. ఫలితంగా టిక్కెట్ విషయం మరింత ఆసక్తిగా మారింది. నాని అనుచర వర్గంతోపాటు వైసీపీ శ్రేణుల్లోనూ నానికే టిక్కెట్ ఇస్తారంటూ ఆశిస్తున్నారు. మరో వైపు కొట్టు వర్గమూ ఇదే ధీమా వ్యక్తం చేస్తోంది. దీనిపై ఈ రోజు మరింత స్పష్టత రానుంది.

జనసేనను గెలిపిద్దాం
భీమవరానికి పట్టిన శని వదిలిద్దాం

కార్యకర్తల సమావేశంలో అభ్యర్థి అంజిబాబు



భీమవరం, మార్చి 14 : 'సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ జనసేన జెండాను ఎగురవేసి భీమవరానికి పట్టిన శని వదిలిద్దాం' అంటూ భీమవరం జనసేన అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) కూటమి శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. మల్లీఫ్లెక్స్‌లోని కల్యాణ మండపంలో నియోజకవర్గ జనసేన కార్యకర్తల పరిచయ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'జనసేన, టీడీపీ గతంలో కలవకపోవడంతోనే పవన్ ఓటమి చెందారు. అంతేకానీ ప్రస్తుత ఎమ్మెల్యే గొప్పతనం కాదు. ఆయన మాత్రం తాను గొప్ప హీరోనని చంకలు గుద్దుకుంటున్నారు. ఇప్పుడు అందరం కలిశాం, గొప్ప మెజారిటీతో గెలుస్తాం.. వైసీపీని తరిమికొడదాం. ఈ ఐదేళ్లలో అరాచక పాలన చూస్తున్నాం. ఇళ్ళ ప్రారంభోత్సవాలు చూస్తుంటే జంబలకిడి పంబలా ఉన్నాయి. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ మతిస్థిమితం లేక మాట్లాడుతున్నారు. ఎప్పుడో 15 ఏళ్ల నాటి విషయం ఇప్పుడు రచ్చ చేస్తున్నారు. రైతులు తీసుకోమంటేనే నేను వెనక్కి భూములు తీసుకున్నాను. ఏ తప్పు చేయలేదు. పవన్ కల్యాణ్ పిలిచి మీలాంటి వారు రాజకీయాల్లో ఉండాలని, నిజాయితీ, విలువలు కలిగిన వారు సమాజానికి ఎంతో అవసరమన్నారు. జనసేన నాయకులందరూ నన్ను స్వాగతిస్తున్నారు. టీడీపీ శ్రేణులు పూర్తి సహకారం అందిస్తున్నాయి' అని పేర్కొన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు(చినబాబు) మాట్లాడుతూ 'ఈ ఐదేళ్లలో భీమవరం నియోజకవర్గం అక్రమ కేసులు, గ్రామాలపై దాడులతో కూనరిల్లింది. ఈ ఎన్నికల్లో నన్ను పోటీ చేయమని అడిగారు. అయితే నేనే తిరస్కరించా. అంజిబాబును భారీ మెజార్టీతో గెలిపించేందుకు తన శక్తివంచన లేకుండా కృషి చేస్తాన'న్నారు. వేగేశ్న కనకరాజు సూరి తదితరులు మాట్లాడారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులను, జనసైనికులను, వీర మహిళలను జిల్లా అధ్యక్షుడు చినబాబు, జిల్లా పార్టీ కార్యదర్శి చెన్నమల చంద్రశేఖర్ అంజిబాబుకు పరిచయం చేశారు. జడ్పీటీసీ గుండా జయప్రకాష్, బండి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పీబీఆర్ రాజీనామా



తణుకు, మార్చి 14 : తణుకు నియోజకవర్గంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అనుచరుడిగా వున్న వేల్పూరుకు చెందిన పోలేపల్లి వెంకట ప్రసాద్(పీబీఆర్) పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం రాత్రి వేల్పూరులో వెల్లడించారు. వైసీపీలో క్రియాశీలంగా పనిచేసిన తాను ఏడాది కాలంగా పార్టీకి దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. పార్టీ విజయం కోసం పనిచేసిన తన లాంటి వారిని మంత్రి దూరం పెట్టారని ఆరోపించారు. ఎన్నికల్లో కారుమూరికి వ్యతిరేకంగా పనిచేసిన వారందరిని ఆయన పక్కన కూర్చోపెట్టుకుని, పార్టీ కోసం పనిచేసిన వారిపై లేనిపోని ఆరోపణలు చేసి దూరం పెట్టారని విమర్శించారు. పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెడుతున్నారని పేర్కొన్నారు.

అభ్యర్థుల ఖర్చు లెక్కించడానికి..
రేటు చార్ట్ అమలు : డీఆర్వో

ఏలూరు సిటీ, మార్చి 14 : రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ఖర్చు పర్యవేక్షణకు రేటు చార్ట్ ఖచ్చితంగా అమలు చేస్తామని ఏలూరు జిల్లా డీఆర్వో డి.పుష్పమణి తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గురువారం సంబంధిత అధికారులతో సమావేశమై ఎన్నికల ఖర్చు లెక్కింపునకు రేట్‌చార్ట్ నిర్ణయంపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి సంబంధించి ఖర్చును రేట్ చార్ట్ ప్రకారం నిర్ణయించి వారి ఖాతాలో లెక్కిస్తారన్నారు. సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితరాలకు వినియో గించే వాహనాలు, షామియానాలు, మైక్ సెట్, ఆహారం, మీడియా, ప్రకటనలు తదితరాల న్నింటిని రేట్ చార్ట్‌లో నిర్దేశించిన రేట్ల ప్రకారం అభ్యర్థుల ఖాతాలో లెక్కలు నమోదు చేస్తారన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ రాజు, పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆదిశేషు, డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో కౌంటింగ్, ఈవీఎం కేంద్రాల పరిశీలన



భీమవరం, మార్చి 14 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాలను, ఈవీఎం డిస్ట్రి బ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం త్వరతగతిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని పశ్చిమ జాయింట్ కలెక్టర్, ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సి.వి. ప్రవీణ్ ఆదిత్య సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉండి నియోజకవర్గానికి సంబంధించి ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న కౌంటింగ్ కేంద్రాలను, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాట్లను ఆయన గురువారం పరిశీలించి భద్రతా చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లను వెంటనే పూర్తి చేయాలన్నారు. జిల్లా సర్వే అధికారి జాషువా, జిల్లా రహదారులు భవనాల శాఖ అధికారి లోకేశ్వరరావు, ఉండి, ఆకివీడు, కాళ్ల, పాలకోడేరు తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఆకివీడు మునిసిపల్ కమిషనర్, రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్లలో జోష్

- వీడిన నరసాపురం టిక్కెట్ సస్పెన్స్
- ఇప్పటికే రూ.కోట్లలో సాగిన పందేలు



నరసాపురం, మార్చి 14 : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గ అసెంబ్లీ టిక్కెట్ సస్పెన్స్ వీడడంతో పందెం రాయుళ్లల్లో జోష్ నెలకొంది. జనసేనకే టిక్కెట్ కేటాయించడం, అది కూడా నాయకర్‌కే రావడంతో అతనిపై పందెం కాసిన బెట్టింగ్ రాయుళ్లల్లో ఫుల్ జోష్ నెలకొంది. నాయకర్‌కు బీఫాం ఇవ్వడంతో ఇక సీటు అతనికేనని భావించిన బెట్టింగ్ కాసిన కొందరు పందెం మొత్తం ఇచ్చేస్తున్నారు. ఇంకొందరు ప్రకటించిన తర్వాతే ఇస్తామన్న ఒప్పందంలో ఉన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నరసాపురం సీటుపై పందేలు జరిగాయి. అన్ని ప్రధాన పార్టీల్లో సీటు ఆశిస్తున్న అభ్యర్థులు ఇద్దరు ముగ్గురు ఉండటమే. దీంతో సీటు మాదేనంటూ ఎవరికీ వారే ధీమా వ్యక్తం చేశారు. పొత్తు కుదరడంతో రెండు పార్టీల నుంచి అభ్యర్థులు పోటీ పడ్డారు. సీటు తమకేనంటూ ధీమా వ్యక్తం చేశారు. ఇటు జనసేనకు దక్కితే తమ నాయకుడిదే సీటు అని, టీడీపీకి వస్తే తమకేనంటూ కాళ్లదువ్వడంతో పందేలకు తెర లేచింది. ఎక్కువ పందేలు జనసేన వైపే సాగాయి. ముందు ఎదురు పందేలు కాసుకుని మధ్యవర్తుల దగ్గర సొమ్ము కలిపారు. ఇది రూ.లక్షల్లోకి వెళ్లింది. దీంతో క్రికెట్ బుకీలు రంగంలోకి దిగారు. కమీషన్ వస్తుండటంతో రెండు వైపులా పందేంరాయుళ్ళను వాళ్లే సెట్ చేశారు. కోసు పందేలు కూడా వెళ్లాయి. ఒకదశలో ఒకటికి నాలుగు రెట్లు పలికింది. టీడీపీ, జనసేన మొదటి జాబితా ప్రకటించిన తర్వాత పందేలు జోరందుకున్నాయి. బుకీల దగ్గర కాస్తే బయటకు రావని భావించి చాలామంది అప్పులు చేసి మరీ పందేలు కాశారు. చివరకు నాయకర్‌కు బీఫాం ఇవ్వడంతో ఒకవైపు పందేంరాయుళ్లల్లో జోష్ నెలకొంది.

రైతు సంఘాల నిరసనలు

ఏలూరు కలెక్టరేట్/భీమవరం అర్బన్, మార్చి 14 : కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు గురువారం ఉమ్మడి పశ్చిమ జిల్లాలో రైతుసంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన, ధర్నాలు నిర్వహించారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సీఐటీయూ ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ఎన్.వి.డి ప్రసాద్, బి.కె.ఎం.యూ జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకుడు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ రైతుల చలో ఢిల్లీలో భాగంగా రైతాంగానికి మోదీ ప్రభుత్వం లిఖితపూర్వకంగా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయకుండా మోసగించిందన్నారు. కేరళ తరహాలో రైతురుణ విమోచన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లకుండా పోలీసులు ఇనుప ముళ్ళకంచెను వేసి అడ్డుకున్నారు. కౌలు రైతుల సంఘం, రైతుకూలీ సంఘం, విద్యార్థి సంఘాల నాయకులు మన్నవ కృష్ణచైతన్య, పి.కిషోర్, కృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో గుణపాఠం చెబుతాం..

రైతులకు మోదీ ఇచ్చిన హామీలు అమలు కోసం మార్చి 14 చలో ఢిల్లీ కార్యక్రమానికి మద్దతుగా రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో చేపట్టిన నిరసనలో రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబురావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. రైతు, కార్మిక సంఘాల నాయకులు జుత్తిగ నర్సింహమూర్తి, జక్కంశెట్టి సత్యనారాయణ, లంక కృష్ణమూర్తి, వాసుదేవరావు, డి.కల్యాణి, ఆంజనేయులు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, కార్మిక సంఘాల నాయకులు

నూజివీడు వీణకు జియో ట్యాగింగ్

- నూజివీడు ట్రిపుల్ ఐటీ ఆధ్వర్యంలో చర్యలు



నూజివీడు టౌన్, మార్చి 14 : సప్తస్వరాల నూజివీడు వీణకు జీవో ట్యాగింగ్ దిశగా అడుగులు పడుతున్నాయి. బొబ్బిలి వీణకు ఇటీవల జియో ట్యాగింగ్ గుర్తింపు లభించిన నేపథ్యంలో నూజివీడు వీణకూ జియో ట్యాగింగ్ కల్పించే దిశగా రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ నూజివీడు క్యాంపస్ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్జీయూకేటీ ఛాన్సలర్ సలహాదారులైన కృష్ణా యూనివర్సిటీ మాజీ వీసీ కె.వి.ఎన్నారావు, ప్రొఫెసర్ జి.మోహన్ రావులతో కూడిన బృందం పట్టణంలోని షేక్ మాబు వీణల తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వీణల తయారీలో పాత, నూతన సాంకేతికత, దక్షిణ భారత దేశంలో ఇతర ప్రాంతాల వీణలకు నూజివీడు వీణలకు ఉన్న సారూప్యత, బేధాలను డాక్యుమెంట్ రూపంలో సమర్పించి జియోట్యాగింగ్ దిశగా అడుగులు వేస్తున్నట్టు ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ అధికారులు పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటీ మెంటార్ సలీమ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు



ఏలూరులో..

ఏలూరు ఎడ్యుకేషన్/ భీమవరం ఎడ్యుకేషన్, మార్చి 14 : ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు గురువారంతో ముగిశాయి. రసాయన శాస్త్రం, వాణిజ్యశాస్త్రం పరీక్షలకు జనరల్ విభాగంలో మొత్తం 13,452 మంది, ఒకేషనల్ విభాగంలో 1,574 మంది విద్యార్థులు హాజరైనట్టు డీవీఈవో ప్రభాకరరావు వివరించారు. ద్వితీయ సంవత్సరం ప్రధాన పరీక్షలు శుక్రవారంతో పూర్తికానున్నాయి. స్వల్పసంఖ్యలో విద్యార్థులుండే బ్రిడ్జి కోర్సు, ఒకేషనల్ కోర్సుల పరీక్షలు జిల్లాలో 12 కేంద్రాల్లో ఈనెల 18 వరకు జరుగుతాయి. కాగా ఇప్పటికే ప్రారంభించిన జవాబు పత్రాల మూల్యాంకాన్ని ఈనెల 18 నుంచి విడతల వారీగా మిగతా సబ్జెక్టుల్లోనూ చేపట్టి ఏప్రిల్ మొదటివారంలోగా ముగించేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 50 పరీక్ష కేంద్రాల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో కెమిస్ట్రీ, కామర్స్, ఒకేషనల్ పరీక్షలు జరిగాయి. జనరల్ 16,951 మందికి 16,416 మంది హాజరుకాగా 535 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,557 మందికి 1325 మంది హాజరు కాగా 232 మంది గైర్హాజరయ్యారు. ఈనెల 16వ తేదీ నుంచి ఒకేషనల్ విద్యార్థులు 12 సెంటర్లలో 427 మంది, 18న 11 సెంటర్లలో 380 మంది పరీక్షకు హాజరవుతారు.


రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు అందుకున్న ఉద్యోగులతో డీఎంహెచ్‌వో శర్మిష్ట

'కోడ్' కూయకముందే క్రమబద్ధీకరణ అయ్యేనా ?

ఉమ్మడి జిల్లాలో 23 మంది వైద్య ఉద్యోగుల్లో తీవ్ర ఉత్కంఠ

రెండో విడతగా 62 మందికి రెగ్యులరైజేషన్ పత్రాలు

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న మరో 62 మంది ఉద్యోగుల సర్వీస్ రెగ్యులరైజేషన్‌కు సంబంధించి నియామక ఉత్తర్వులను గురువారం డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట అందజేశారు. ఎంపీహెచ్‌ఏ (మేల్,ఫిమేల్), ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ల కేడర్లలో రెండో విడతగా మొత్తం 62 మంది ఉద్యోగుల క్రమబద్ధీకరణకు జీవోలు 40,41 లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో అర్హత సాధించిన ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించిన అనంతరం రెగ్యుల రైజేషన్ ఉత్తర్వులను అందజేశారు. ఉమ్మడి జిల్లా నుంచి క్రమబద్ధీకరణకు అర్హతలు గల మొత్తం 270 మంది ఉద్యోగుల జాబితాను ప్రభుత్వానికి పంపగా, వీరిలో ఇద్దరు అభ్యర్థులకు ఇప్పటికే 60 సంవత్సరాల వయసు ఉన్నట్టుగా వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టరేట్ గుర్తించినట్టు తెలిసింది. నిబంధనల ప్రకారం 62 సంవత్సరాల ఉద్యోగ విరమణ వయసు కాంట్రాక్టు ఉద్యోగులకు వర్తించనందున ఎంపీహెచ్‌ఏ (మేల్) విభాగం నుంచి పంపిన ప్రతిపాదనల్లో ఇద్దరికి రెగ్యులరైజేషన్ వర్తించే అవకాశం లేదని సమాచారం. దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. కాగా ఉమ్మడి జిల్లాలో ఇంకా పెండింగ్‌లో వున్న 23 మంది ఉద్యోగులకు సంబంధించిన రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వ జీవోలు ఎప్పుడు జారీ అవుతాయోనని ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే ప్రభుత్వ జీవోలు జారీ అయితేనే వీరికి రెగ్యులరైజేషన్ ఆర్డర్లు జిల్లాలో ఇవ్వడానికి అవకాశం ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

వెబ్‌సైట్‌లో ఫార్మసిస్టు ఉద్యోగార్థుల తాత్కాలిక మెరిట్ జాబితా

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14 : ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ జోన్-2 (రాజమండ్రి) పరిధిలోని ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా జిల్లాల్లో గ్రేడ్-2 ఫార్మసిస్టు ఉద్యోగ ఖాళీలను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీచేసే ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక మెరిట్ లిస్టును సంబంధిత జిల్లాల వెబ్‌సైట్లలో పొందుపర్చినట్టు రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పద్మాశశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ఈనెల 15 నుంచి 18వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రాజమండ్రిలోని తమ కార్యాలయంలో వ్యక్తిగతంగా సమర్పించాలని సూచించారు.

గ్రేడ్-2 వీఆర్వోల ప్రొహిబిషన్‌పై సానుకూలత

ఏలూరు రూరల్, మార్చి 14: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల, గ్రేడ్-2 వీఆర్వోల ప్రొహిబిషన్‌కి సంబంధించి సర్వే ఎగ్జామ్స్, సీపీటీ పాస్ కాని వారికి ఒక సంవత్సరం సమయం ఇస్తూ రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలపై ఎంతోకాలం నుంచి ఎదురుచూస్తున్న సుమారు 800 మంది గ్రేడ్-2 వీఆర్వోల ప్రొహిబిషన్ డిక్లేర్ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.


రికార్డులను పరిశీలిస్తున్న సీఏఏ అధికారులు

నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువుల తవ్వకంపై విచారణ

నరసాపురం రూరల్, మార్చి 14: పట్టణంలోని పీచుపాలెం గ్రామంలో ఓసూరి దేవేంద్ర ఫణికర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం సీఏఏ (కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ) సబ్ డివిజన్ కమిటీ సభ్యులు విచారణ నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా చెరువులు సాగు చేస్తున్నారన్న ఫిర్యాదుతో మత్స్యశాఖ ఏడీఈ వెంకటేశ్వ రావు, వ్యవసాయశాఖ ఏడీఈ డాక్టర్ అనిల్‌కుమారి, తహసీల్దార్ ప్రసాద్, అటవీ శాఖ రేంజ్ అధికారి దొర సంఘటన ప్రదేశానికి వెళ్లారు. అక్కడ గోదావరికి అనుకుని 200 మీటర్ల లోపు చెరువులు ఉన్నాయా ? లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. పలు రెవెన్యూ రికార్డులు తనిఖీ చేశారు. దీనిపై ఒక నివేదికను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని కమిటీ పేర్కొంది. కమిటీ వెంట ఎఫ్‌డీవో కె.భారతి, సర్వేయర్ కురిష్, వీఆర్వో శేఖర్, ఆర్.సురేష్‌లు ఉన్నారు.

పనిచేయని ఈవీఎంలతో శిక్షణేంటి ?

ద్వారకాతిరుమల, మార్చి 14: సాధా రణ ఎన్నికల నేపథ్యంలో పీవో, ఏపీ వోలకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం జరిగింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల పనితీరును చూపుతూ పీవో, ఏపీవోలకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా దాని గురించి పనిచేయని ఈవీఎంలతో వివరించడంతో శిక్షణ పొందేవారు అవాక్కయ్యారు. ఇందులో పొందుపరచిన నూతన టెక్నాలజీ సీనియర్ పీవోలకు కూడా అర్థం కాదని అటువంటిది ఓరల్‌గా శిక్షణ ఇవ్వడం వల్ల ఏమి ఉపయోగం ఉంటుందని శిక్షకులు అంటున్నారు. ఈ మిషన్ ద్వారా చివరిలో సీలు వేయడంతో సహా అన్నీ కొత్త పద్ధతులు రాగా ఏమీ చూపకుండానే 130 మందికి రెండు విడతలుగా శిక్షణను తూతూ మంత్రంగా ఇచ్చారు.

చిల్లకూరులో రోడ్డు ప్రమాదం

తాడేపల్లిగూడెం వాసి మృతి




చిల్లకూరు, మార్చి 14: ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో గురువారం వేకువ జామున ఈ ప్రమాదం జరిగింది. గిద్దలూరు నుంచి చెన్నైకి వెళుతున్న ఆర్టీసీ బస్సు టైరు పంక్చర్ కావడంతో టోల్‌ప్లాజా సమీపంలో రోడ్డు పక్కన ఆపారు. తాడేపల్లిగూడెం నుంచి చెన్నైకి వెళుతున్న ఓ కారు అదుపుతప్పి ఆగి ఉన్న బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనం వెనుక రాళ్లు పెడుతున్న ప్రకాశం జిల్లా బెస్తవారిపేట ప్రాంతానికి చెందిన బస్సు డ్రైవర్ మలన్‌షా వల్లీ(52), కారులో డ్రైవర్ పక్కన కూర్చొని ఉన్న తాడేపల్లిగూడెంకు చెందిన సుదర్శన్ రావు (68) అక్కడికక్కడే మృతి చెందారు. కారు డ్రైవర్ రామచంద్రరావు, సుదర్శన్‌రావు భార్య పద్మావతి, కుమార్తె అనురాధలకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుదర్శన్‌రావు తన కుమార్తెకు వైద్యపరీక్షలు చేయించడానికి కారులో చెన్నైకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందని కుటుంబీకులు తెలిపారు. ఎస్‌ఐ అంజిరెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆపరేషన్లు అబద్ధం !

జగనన్న ఆరోగ్య సురక్ష ఆపరేషన్‌లపై ప్రచారం

నూరుశాతం శస్త్ర చికిత్సలు చేశామంటూ ఆర్భాటపు ప్రకటనలు

తొలి దఫా జిల్లాలో ఆపరేషన్లకు ఎంపిక చేసిన రోగుల సంఖ్య 1,583


మూడు నెలల్లో చేసినవి 415 మాత్రమే

భీమవరం, మార్చి 14 : అబద్ధాలతో, అవాస్తవాలతో అభివృద్ధి చేశామని చెబుతున్న జగన్ ప్రభుత్వం రోగులతో కూడా ఆటలాడుకుంటోంది. ఎన్నికల దృష్టిలో ఉంచుకొని ఇంటింటికి వైద్య బృందం వెళ్లి సేవలందిస్తుందంటూ ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రచారం తప్ప వైద్యులు లేదని తేలిపోయింది. ఈ శిబిరాల్లో తొలిదఫాలో ఆపరేషన్లకు ఎంపిక చేసిన రోగులకు మూడు నెలలుగా ఆపరేషన్లు చేయడం లేదు. కానీ నూరుశాతం శస్త్ర చికిత్సలు చేశామంటూ ఊదరగొడుతున్నారు..

జగనన్న సురక్ష పేరుతో గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందించేందుకు గతేడాది ప్రభుత్వం ప్రారంభించిన వైద్య శిబిరాల్లో ఎంపికైన రోగులకు వైద్య సేవలందించడంలో జాప్యం జరుగుతోంది. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో సేవలందించి ఆసుపత్రులు బిల్లుల ప్యాకేజీ మంజూరును రూ.25 లక్షలకు పెంచినప్పటికి సేవలందించడంలో కష్టాలు మొదలయ్యాయి. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే తరుణంలో ఆరోగ్యశ్రీ ట్రస్టు ఆస్పత్రులు ముఖ్యంగా ప్రైవేట్ ఆసుపత్రులు తమ సేవలు గణనీయంగా తగ్గించాయనడానికి ఆరోగ్య సురక్షలో ఎంపికైన రోగుల అందిన వైద్యమే ఇందుకు ఉదాహరణ. ఇప్పటికే గతనెల రెండో వారంలో పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ట్రస్టు ఆసుపత్రులు నోటీసులు జారీ చేశాయి. గతేడాది అక్టోబరు నుంచి బిల్లుల మంజూరులో జాప్యం పెరిగింది. సుమారు రూ.50 వేల లోపు బిల్లులు మాత్రమే మంజూరు చేస్తున్నారు. ఆపైన బిల్లులు పెండింగ్‌లో పడడంతో చాలా ఆస్పత్రులు సేవలపై చేతులు ఎత్తేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ జనవరి ఒకటి నుంచి రూ.25 లక్షలు బిల్లులను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అంతలోనే సమ్మె చేస్తామని ఆస్పత్రులు హెచ్చరికలు జారీచేశాయి. అధికార పార్టీల ప్రతినిధులు ఈ పథకాన్ని డబ్బాలు కొడుతూ విస్తృతంగా ప్రచారం చేసుకుంటుంటే సేవలు మాత్రం మందగించాయి.

తొలి దఫాలో 1,583 మంది ఎంపిక

జిల్లాలో ఐదు లక్షల 82 వేల 585 కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయి. వీరికి 30 ప్రైవేటు ఆస్పత్రులు, ఒక జిల్లా ఆసుపత్రి, నాలుగు ఏరియా ఆసుపత్రులు, మూడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 34 ప్రైమరీ హెల్త్ సెంటర్లు కలిపి 72 ఆసుపత్రులు పని చేస్తున్నాయి. గతేడాది జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో తొలిదఫాలో జిల్లాలో 458 శిబిరాలు నిర్వహించారు. ఇందులో మూడు లక్షల 36 వేల 536 మంది రోగులు హాజరు కాగా 12,947 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 8,422 మందికి చికిత్స చేసి 2,838 మందికి కాంటాక్టు లెన్స్ అందించారు. ఇతర ఆరోగ్య పరమైన చికిత్సల కోసం 1,583 మందిని ఎంపిక చేసి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్సలకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిఫారసు చేసింది. వీరందరికి



ఆరోగ్యశ్రీ వైద్య సేవలందాల్సి ఉంది. మరోవైపు గతేడాది రెండో దఫా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు తెరతీశారు. ఈ ఏడాది జూన్ నెలాఖరు వరకు కొనసాగనున్నాయి.

415 మందికి మాత్రమే ఆపరేషన్లు

జిల్లా సురక్ష శిబిరాల్లో 1,583 మంది రోగులను వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్టు ఎంపిక చేసి శస్త్ర చికిత్సల నిమిత్తం గతేడాది తొలి దఫా ఆరోగ్యశ్రీకి సిఫారసు చేశారు. అయితే ఇంతవరకు ఆపరేషన్లు జరిగింది 415 మందికి మాత్రమే. మిగిలిన వారికి సేవలందడంలో జాప్యం జరుగుతోంది. ఇందుకు ప్రైవేటు ఆసుపత్రులకు బిల్లుల విడుదలలో జాప్యమే కారణం. ఈ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గతేడాది డిసెంబరు నెలాఖరు వరకు నాలుగున్నరేళ్లపాటు జిల్లాలో ఆపరేషన్లు చేయించుకున్న వారి సంఖ్య లక్షా 93 వేల 122. వీరికైన ఖర్చు రూ.409.65 కోట్లు. వీటికి సంబంధించి ఆసుపత్రులకు కోట్లలోనే చెల్లించాలి. లక్షలోపు బిల్లులు వేగంగానే మంజూరవుతున్నా, ఆపై బిల్లులు పెండింగ్ పడుతున్నాయి. దీనిపై గత జనవరిలో భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకుకు చెందిన పలు ఆసుపత్రులు నోటీసులు జారీ చేశాయి. కొన్ని ఆసుపత్రులకు రూ.50 లక్షల నుంచి ఐదు కోట్ల వరకు బకాయిలు ఉన్నట్టు చెబుతున్నారు. వాస్తవానికి ఇలా ఆరోగ్యశ్రీ సేవలు పొందే వారితో పాటు జగనన్న సురక్ష శిబిరాల్లో ఎంపికైన రోగులకు సేవలందడంలో జాప్యం జరుగుతున్నప్పటికీ అందరికి ఆపరేషన్లు చేశామని ప్రకటించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త సార్‌కి సమస్యల సవాళ్లు !

నరసాపురం డీఎస్పీగా శ్రీనివాసరావు బాధ్యతలు



నరసాపురం, మార్చి 14: నరసాపురం డీఎస్పీగా శ్రీనివాసరావు గురువారం బాధ్యతలు చేపట్టారు.ఆయన విజయవాడ నుంచి బదిలీపై వచ్చారు. అక్కడ ట్రాఫిక్ డీఎస్పీగా పని చేశారు. ఇప్పటి వరకు పని చేసిన డీఎస్పీ మనోహరాచారీ బదిలీపై తిరుపతి వెళ్లారు. కొత్త డీఎస్పీని సబ్ డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్సైలు మార్యదపూర్వకంగా కలిశారు. ఆయనకు అనేక సమస్యలు స్వాగతం ఇస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో కొన్ని సర్కిళ్ళల్లో పోలీస్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ఇటీవల నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో ఏసీబీ దాడి చేసి ఎస్సై, రైటర్, జీపు డ్రైవర్‌ను లంచం కేసులో పట్టుకున్నారు. జిల్లా పోలీస్‌శాఖలో ఇది సంచలనమైంది. ఇటు ఏసీబీ కూడా 498 కేసులో ఇంత పెద్ద మొత్తం లంచం తీసుకుంటారా ? అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. దీంతో సర్కిల్‌లో జరుగుతున్న అవినీతి భాగోతాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. సర్కిల్ పరిధిలో కొందరు పోలీసులు దళారుల్ని ప్రోత్సాహిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఏసీబీ దాడుల తరువాత గుప్పుమన్నాయి. వీరి ప్రమేయం వల్లే చిన్నచిన్న కేసులకు కూడా పెద్ద మొత్తాల్లో దండుకుంటున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇందులో ఇద్దరు పోలీసుల వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. స్టేషన్‌కు సంబంధించిన విషయాలు ఎప్పటికప్పటికి బయటకు చేరవేరుస్తారని, స్టేషన్‌కు ఫిర్యాదుదారుల్ని దళారుల్ని కలవమని వీళ్లే తెర వెనుక నడిపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే వీరిద్దరిపై ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. వీటితో పాటు అన్ని స్టేషన్లలో సిబ్బంది కొరత కూడా ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఎన్నికల్ని ఏవిధంగా ముందుకు తీసుకెళతారన్నది పోలీస్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.


త్రీటౌన్ సీఐ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న సాయుధ దళాలు

సాయుధ దళాల కవాతు

ఏలూరు క్రైం, మార్చి 14 : సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ముందస్తుగా శాంతి భద్రతలు కాపడడానికి ప్రజలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడానికి సాయుద దళాలు జిల్లాకు చేరుకున్నాయి. ఏలూరు, పోలవరం, జంగారెడ్డిగూడెం, నూజివీడు సబ్ డివిజన్లకు ఈ దళాలు కొద్ది రోజులు క్రితం వచ్చాయి. ఆ పరిధిలోని గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్నారు. ఏలూరు త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో దుగ్గిరాల, శనివారపుపేట, సత్రం పాడు, ఇందిరా కాలనీ, వట్లూరు ప్రాంతాల్లో గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు.

ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14 : ఇద్దరు ఉపాధ్యాయులను డీఈవో సస్పెండ్ చేశారు.విద్యార్థినులను దండిస్తున్న కారణంగా జంగారెడ్డిగూడెంలోని జిల్లాపరిషత్ హైస్కూలు హిందీ ఉపాధ్యాయుడు ఎస్.గోవిందరావును, పాఠశాల విధులను సరిగా నిర్వహించకపోవడంతో పాటు బాలికలను దండిస్తున్న అభియోగాలపై గణపవరం మండలం పిప్పర జడ్పీ హైస్కూలు వ్యాయామోపాధ్యాయుడు ఆర్.సీతారామ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు.

భవిష్యత్తు వర్చువల్ రియాలిటీదే


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ జే.విశ్వేశ్వరన్

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 14 : వర్చువల్ రియాలిటీ సాంకేతికతను వినియోగిస్తున్నప్పుడు ఓ సరికొత్త అద్భుత ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి కల్గుతుందని ఏఆర్‌కే ఇన్ఫో సొల్యూషన్ కంట్రీ మేనేజర్ డాక్టర్ జే.విశ్వేశ్వరన్ అన్నారు. ఏపీ నిట్ ప్రాంగణంలో గురువారం ఆగ్ మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీ సాంకేతికతపై విద్యార్థులకు అవగాహనా నిర్వహించారు. విశ్వేశ్వరన్ మాట్లాడుతూ 2030 నాటికి ప్రపంచంలోని పరిశ్రమల్లో 5.0 లక్ష్యాలను అందుకోవడానికి సరికొత్త సాంకేతికతలు ఎంతగానో దోహదపడతాయన్నారు. లేనిదాన్ని ఉన్నట్లు వాస్తవానికి దగ్గరగా చూపించడమే ఈ టెక్నాలజీ ప్రత్యేకత అన్నారు.ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌ను ఉపయోగిస్తున్నట్లే భవిష్యత్‌లో ఈ నూతన టెక్నాలజీని కూడా వినియోగిస్తారన్నారు. వీటిపై పట్టు సాధించిన విద్యార్థులకు కొలువలకు కొదవ ఉండదన్నారు.సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కే.హిమబిందు అధ్యక్షత వహించగా ఆచార్యులు డాక్టర్ కార్తిక్ శేషాద్రి, డాక్టర్ సందీప్ పాల్గొన్నారు.


గొల్లలకోడేరులో శిక్షణ ఇస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం..ఆదాయం

పాలకోడేరు, మార్చి 14 : రసాయనిక మందులు వేసిన పంటలు ఆహారంగా తీసుకోవడం ద్వారా అనారోగ్యం పాలవుతున్నామని ఇది రైతులతో పాటు ప్రజలు గమనించాలని కృషి-సఖి డివిజన్ ఇన్‌చార్జి స్వామి, ఎంటీ రమేష్, గ్రామ యూనిట్ అధికారి వీరేంద్ర అన్నారు. గొల్లలకోడేరు గ్రామంలో కృషి-సఖి సీఆర్పీలకు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది.ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆరోగ్యంతో పాటు ఆదాయ వనరులు కూడా పెంచుకోవచ్చునన్నారు. డివిజన్ ఇన్‌చార్జి స్వామి అగ్నిస్త్రం కషాయం తయారు చేసి చూపించారు. కషాయం తయారీకి 10 లీటర్ల ఆవు మూత్రం, 5 కేజీల వేపాకులు, పొగాకు కేజీ, పచ్చిమిర్చి కేజీ, వెల్లుల్లి అరకేజీ ఒక పాత్రలో వేసి బాగా మరిగించాలన్నారు. తరువాత 48 గంటలు వరకు చల్లారనిచ్చి వగడ గట్టాలన్నారు. ఇది 6 నెలలు నిల్వ ఉంటుందన్నారు. ఎకరానికి 6 లీటర్ల అగ్నస్త్రం 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారి చేస్తే అన్ని రకాల కాయ తొలుచు పురుగులు, కాండం తొలుచు పురుగులు నివారించవచ్చున్నారు. ఐసీఆర్పీలు వెంకటలక్ష్మి, రమాదేవి, కృషి సీఆర్పీలు భవాని, కళ్యాణి, బాలా, అనురాధ, జానకీ, తదితరులు పాల్గొన్నారు.


ఆక్వారైతుల రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సభ్యులు

న్యాయం జరగకపోతే ఆక్వా రైతులతో చలో భీమవరం

పాలకొల్లు రూరల్, మార్చి, 14 : పాలకొల్లు రూరల్ మండలంలోని చందపర్రులో ఉన్న ట్రిబుల్ ఎస్ కళ్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆక్వారైతు సంఘం కార్యవర్గ సమావేశం గురువారం జైభారత్ క్షీరారామ ఆక్వా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు అధ్యక్షతన జరిగింది. భగవాన్‌రాజు మాట్లాడుతూ ప్రొసెసింగ్ యూనిట్ల యజమానుల నియంతృత్వం వల్ల ఆక్వారైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు.ఆక్వా రైతుల సంక్షేమం కోసం రొయ్యల ప్రొసెసింగ్ యూనిట్ల యజమానులు తమ డిమాండ్లకు తగినట్లు ఆక్వా రైతులకు న్యాయం చేయకపోతే ఈనెల 23న 25వేల మంది ఆక్వా రైతులతో చలో భీమవరం రూపొందించినట్లు భగవాన్ రాజు తెలిపారు. రుద్రరాజు సత్యనారాయణరాజు, కోడి విజయభాస్కర్, రూప్ కుమార్‌రాజు, బోనం చినబాబు, కె.వినాయక్, పి.విజయరాజు, యువరాజు, డి.మధుసూదనరావు,సభ్యులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో... హాజరైన వైద్యులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ సెంటర్లు మూసివేస్తాం : డీఎంహెచ్‌వో

భీమవరం, మార్చి 14 : లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా చట్ట రీత్యా నేరమని అటువంటి సెంటర్లను సీజ్ చేసి క్రిమినల్ కేసులు పెడతామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, లింగ నిర్ధారణ నిరోధక చట్టం జిల్లా కమిటీ ఛైర్మన్ డాక్టర్ డి.మహేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. మహేశ్వరరావు మాట్లాడుతూ, తల్లి గర్భంలో పిండస్థ శిశు మరణాలు నిరోధించాలని చెప్పారు. ప్రోగ్రాం అధికారులు జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలన్నారు. సెంటర్ల తనిఖీ సమయంలో స్కానింగ్ కోసం పురమాయించిన వైద్యులు, సంబంధిత దస్త్రాలను నిశితంగా పరిశీలించాలన్నారు. కమిటీలోని అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తే మాతృ, శిశు మరణాలు సైతం అరికట్టవచ్చున్నారు. గర్భిణులకు స్కానింగ్ నిర్వహిస్తున్న కేంద్రాలలో ప్రతిరోజు ఫామ్-ఎఫ్ నివేదిక సంబంధిత వెబ్‌సైట్‌లో పొందుపరచాలన్నారు. సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ భానునాయక్, కమిటీ కన్వీనర్ డీఐవో డాక్టర్ సుధాలక్ష్మి, సభ్యులు డాక్టర్ రమణరాజు, సుబ్బలక్ష్మి, కె.ప్రవీణ్ కుమార్, నరేష్, సూర్యనారాయణ రాజు,జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి కిరణ్, భావన, అనంతలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

విర్డ్స్‌లో డయాలసిస్ యూనిట్

ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత సేవలు



ద్వారకాతిరుమల, మార్చి 14: అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం పురస్కరించుకుని ద్వారకా తిరుమల విర్డ్స్ ఆసుపత్రిలో గురువారం అవగాహనా కార్యక్రమం జరిగింది. డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ కిడ్నీ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే డయాలసిస్, కిడ్నీ మార్పిడిని నియం త్రించవచ్చన్నారు. మూత్రపిండాల సమస్యలకు 40 శాతం మధు మేహం కారణమైతే 30 శాతం మేర రక్తపోటు కారణమవుతోందన్నారు. వీటిని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి ఛైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా నూతనంగా డయాలసిస్ సేవలను ప్రస్తుతం 40 మంది రోగులకు ఉచితంగా అందచేస్తున్నామన్నారు. వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, సంతోష్‌విహారీ, నాగేవంద్ర, సింధు, డయాలసిస్ యూనిట్ సభ్యులు మధుకిరణ్, జాన్, శరత్, డి.రాణి తదితరులు పాల్గొన్నారు.

రెండు పొగాకు బ్యారన్లు దగ్ధం


పరిశీలిస్తున్న బొరగం శ్రీనివాస్

బుట్టాయగూడెం, మార్చి 14 : బుట్టాయగూడెం మండలం ముప్పినవారిగూడేనికి చెందిన నాదెండ్ల రాంబాబుకు చెందిన రెండు పొగాకు బ్యారన్లు బుధవారం అర్ధరాత్రి అగ్నికి ఆహుతయ్యాయి. ప్రమాదంలో పొగాకు మొత్తం కాలి పోయిందని సుమారు రూ.10 లక్షల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగి నట్లు బాధిత రైతు వాపోయారు. పొగాకును క్యూరింగ్ చేస్తుండగా ప్రమాదం జరిగినట్టు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ గురువారం గ్రామానికి చేరుకుని కాలిపోయిన బ్యారన్లను పరిశీలించారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదు కోవాలని కోరారు. తెల్లం వెంకటేశ్వ రావు, పల్లోతు నాగబాబు, నల్లజర్ల సత్యన్నారాయణ,సత్యనారాయణ, సత్తిరాజు, జానకీరామయ్య, మురళీకృష్ణ, రాంబాబు, గంగాధరావు, పాల్గొన్నారు.

క్రైం కార్నర్


విజిలెన్సు అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం వాహనం

19 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

ఏలూరు క్రైం,మార్చి 14 : జిల్లా విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో జిల్లా విజిలెన్సు సీఐ విల్సన్ వారి సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. ఒక బొలెరో వాహనాన్ని తనిఖీ చేసి 19 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముసునూరు మండలం సింహాద్రిపురం వద్ద గురువారం తెల్లవారుజామున వాహనాల తనిఖీలు చేపట్టారు. బొలెరో పికప్ వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నట్లుగా గుర్తించారు. వ్యాన్ యజమాని,డ్రైవర్ అయిన మల్లవెల్లి శివరంగారావును విజిలెన్సు అధికారులు ప్రశ్నించారు. పెదపాడు మండలం దాసరి గూడెంనకు చెందిన నల్లవెల్లి శ్యామ్‌కు చెందిన బియ్యం అని వెల్లడించారు. ముసునూరు, నూజివీడు మండలాల్లోని పలు రేషన్‌షాపులు, ఎండీయూ వాహనాల్లో తక్కువ ధరకు కొని వాటిని ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లుగా డ్రైవర్ చెప్పాడు. 76 వేల రూపాయల విలువైన రేషన్ బియ్యం, ఆరున్నర లక్షల విలువైన వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మల్లవెల్లి శ్యామ్, మల్లవెల్లి శివ రంగా రావులపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 14 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావుల ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం దాడి చేశారు. పెదవేగి మండలం భోగాపురం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఈబీ సీఐ సునీల్ కుమార్, ఎస్‌ఐ శివప్రసాద్, ఏఎస్‌ఐ పూర్ణ, సిబ్బంది కలిసి దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 11,750 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లుగా సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

భీమవరంలో ఏడుగురి అరెస్టు

భీమవరం క్రైం, మార్చి 14 : భీమవరం రెండవ పట్టణం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి వారి వద్ద రూ.10,850 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

యండగండి రాయిపేటలో పట్టపగలే చోరీ

ఉండి, మార్చి 14: ఇంట్లో ఎవరు లేని సమయం చూసుకుని ఉదయం సమయంలో ఇంటి తలుపులకు వేసిన తాళాలను పగులగొట్టి వెండి, నగదు దోచుకెళ్లారు. ఉండి మండలం యండగండి రాయిపేటకు చెందిన వేగేశ్న రామరాజు (రాంబాబు) కుటుంసభ్యులతో అమెరికా వెళ్లారు. దాంతో చెరువు వద్ద పనిచేసే మనిషి ప్రతీరోజు ఇంటికి వచ్చి చూసుకుని వెళ్తున్నాడు. గురువారం ఉదయం 7 గంటల సమయంలో ఇంటి తలుపులు తీసి వుండడం చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇంట్లో వున్న రూ.8 వేలు నగదు, వెండి వస్తువులు చోరీ చేసినట్టు పోలీసులు తెలిపారు. బాధిత కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు రైటర్ యెషయా తెలిపారు.

ఐరన్ షట్టర్ ప్లేట్ల చోరీ..కేసు నమోదు

పోలవరం, మార్చి 14 : పోలవరం ప్రాజెక్టు కార్మికుల క్యాంపు ప్రాంతంలో ఉన్న షట్టర్ ప్లేట్లు దొంగతనం చేశారంటూ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల చలువ పందిళ్ల కోసం తాటాకు తరలించే నెపంతో తాటాకుల రవాణా చేసే ట్రాక్టర్‌లలో తాటాకుల అడుగున షట్టర్ ప్లేట్లు దాచి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు పోలీసులు రెండు ట్రాక్టర్లను పోలవరం పోలీసు స్టేషన్‌కి తరలించారు. ఈ విషయంపై దొంగతనానికి పాల్పడిన కారింగుల గంగరాజు, పెంటా శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలికను మోసగించిన వ్యక్తి అరెస్టు

భీమవరం క్రైం, మార్చి 14 : బాలికను మాయ మాటలతో మోసగించి గర్భవతి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమవరం పట్టణంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని అదే ప్రాంతంలో కోడి మాంసం విక్రయించే నల్లగంగుల అనిల్‌కుమార్ (38) మాయమాటలతో లొంగ దీసుకున్నాడు. నాలుగు రోజుల క్రితం బాలికకు అనారోగ్యంతో ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా గర్భవతి అని వైద్యులు తెలిపారన్నారు. బాలికను నిలదీయగా విషయం చెప్పినట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలికను వైద్య పరీక్షల కోసం ఆసుపత్రిలో చేర్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అడబాల శ్రీను చెప్పారు.


ఉంగుటూరులో జనసేన పార్టీ పతాకం ఆవిష్కరిస్తున్న పత్సమట్ల ధర్మరాజు

ప్రజాసేవ లక్ష్యంగా జనసేన : ధర్మరాజు

ఉంగుటూరు, మార్చి 14: ప్రజా సేవతో పాటు వివిధ వర్గాల సమస్యల పరిష్కారమే జనసేన పార్టీ లక్ష్యమని నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో జనసేన కూటమి విజయానికి సమష్టి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న చిర్రి బాలరాజు

బుట్టాయగూడెంలో..

బుట్టాయగూడెం, మార్చి 14: జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు పార్టీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. త్వరలో జరగబోవు ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పాల్గొని జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయానికి ఐక్యతతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. మెట్ట బుచ్చిరాజు, పసుపులేటి రాము, కార్యకర్తలు పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మక్కినవారిగూడెంలో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించారు. అడపా నాగరాజు, సాయిల వెంకటేశ్వరరావు, రాఘవరాజు సురేష్, మల్లవరపు ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● కుక్కునూరు: మండల కేంద్రంలో మిత్రపక్షాలైన టీడీపీ, బీజేపీ నాయకులతో కలసి జనసేన నేతలు పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. జనసేన జెండాను మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్ ఆవిష్కరించారు. ములిశెట్టి నాగేశ్వరావు, కోటగిరి సత్యనారాయణ, వాడపల్లి లక్ష్మాచార్యులు, మంత్రి గోపాలకృష్ణ, మోదుంపురపు వెంకన్నబాబు, లక్ష్మణ స్వామి, గాడిద వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: క్రమశిక్షణ కలిగిన ఏకైక పార్టీ జనసేన అని పోలవరం నియోజకవర్గ జనసేన కన్వీనర్ సిర్రి బాలరాజు అన్నారు. పరింపూడి రామాలయం వద్ద జనసేన జెండా ఎగురవేసి కేక్ కట్ చేశారు. తోట రవి, మాదేపల్లి శ్రీను, చోడిపిండి సుబ్రహ్మణ్యం, ఈపూరి సతీష్, బొలిశెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

● చింతలపూడి: స్థానిక మేడబడి సెంటర్లో జనసేన పార్టీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలన్నారు. ఏజీఎస్ కుమార్, పోతుల శ్రీను, పూరేటి సునీత, మాదాసు ఇందిర, శీలం రాజా, ఎ.అప్పారావు, గాంధీ, ఆకుల మధు, తదితరులు పాల్గొన్నారు.

మేమంతా పవన్ కల్యాణ్ వెంటే : కాపు సంక్షేమ సంఘం


మాట్లాడుతున్న శ్రీరాములు, తదితరులు

ఏలూరు రూరల్, మార్చి 14: తామంతా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వెంటే ఉంటామని కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీరాములు అన్నారు. కాపు సంక్షేమ సంఘ ప్రారంభ వేడుకలు బుధవారం నిర్వహించారు. తమకు ఎమ్మెల్యే, ఎంపీ పదవులు వద్దని పవన్‌కల్యాణ్‌కు సలహాలు, సూచనలు ఇవ్వబోమని, లేఖలు కూడా రాయబోమన్నారు. సమాజంలో అన్ని కులాలను కలుపుకుని పెద్దన్న పాత్ర పోషిస్తామని తెలిపారు. ఇటీవల కొందరు కాపు నేతలు తప్పుదారి పట్టారని వారికి కాపు సామాజికవర్గ మద్దతు లేదన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, కొటారి ఆదిశేషు, పూజారి నిరంజన్, దాశరథి, సామర్ల వెంకటేశ్వరరావు, వాసా రాజు, బడే సతీష్, శ్రీదేవి, యడ్లపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు నిధుల మళ్లింపు సరికాదు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘ నేతలు

ఏలూరు రూరల్, మార్చి 14: భవన నిర్మాణ సంక్షేమ బోర్డు నిధులను ప్రభుత్వం దారి మళ్లించడం సిగ్గుచేటు అని పలువురు నాయకులు అన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పటిష్టం చేయాలని కోరుతూ హేలాపురి, ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 17న ఏలూరులో నిర్వహించనున్న జిల్లా సమావేశం వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, బత్తిన శ్రీనివాసరావు మాట్లాడుతూ భవన, ఇతర నిర్మాణసంక్షేమ బోర్డులో తామంతా సభ్యులు అన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి ఒక్క పైసా విదల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పైగా సంక్షేమబోర్డులో ఉన్న నిధులను దారి మళ్లించడం అన్యాయం అన్నారు. కోశాధికారి కె.ప్రసాదరావు, ఎం.శంకర్‌రావు, రవి, కోడిరవి, కృష్ణ, నాగేశ్వరరావు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ధాన్యం బకాయిలు చెల్లించాలి

ఏలూరు టూటౌన్, మార్చి 14: రైతులకు ఖరీఫ్ ధాన్యం బకాయి సొమ్ములు వెంటనే చెల్లించాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవన్‌లో గురువారం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ధాన్యం విక్రయించి 40 రోజులు గడిచినా రైతులకు సొమ్ము చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో రూ.30 కోట్లకు పైగా ధాన్యం బకాయిలు ఉన్నాయన్నారు. కొనుగోలు కేంద్రాలు తెరచి రైతుల నుంచి అపరాలు కొనుగోలు చేయాలన్నారు. అప్పారావు, శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి


హాల్‌టిక్కెట్లను అందజేస్తున్న పద్మశ్రీ

పెదపాడు, మార్చి 14: పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. పెదపాడు హైస్కూల్‌లో పీఎంశ్రీ నిధులతో కెమిస్ట్రీ ల్యాబ్ నిర్మాణానికి పద్మశ్రీ గురువారం శంకుస్థాపన చేశారు. తొలుత ఎస్ఎస్ఏ ద్వారా పంపిణీ చేసిన ఐదు కంప్యూటర్లు, ప్రింటర్‌ను ఎంపీపీ బత్తుల రత్నకుమారితో కలసి ప్రారంభించారు. పదో తరగతి విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు, జామెట్రీ బాక్స్‌లను అందజేశారు. అక్కినేని రాజశేఖర్, హెచ్.ఎం. వి.వెంకటేశ్వరరావు, నీలపాల ఉదయరాజు, రెడ్డి స్వర్ణకుమారి, ఎంఈవో దేవినేని వెంకటరమణ పాల్గొన్నారు.

● కొయ్యలగూడెం: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని మానవత సంస్థ అధ్యక్షుడు నక్కా బాబి కోరారు. కొయ్యలగూడెం జడ్పీ బాలికల పాఠశాల, కన్నాపురం జడ్పీ పాఠశాలలోని విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్ళు, ఎరైజర్ వంటి పరికరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

ఏలూరు రూరల్, మార్చి 14: పదో తరగతి పరీక్షలు ఈనెల 18నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ప్రజారవాణా సంస్థ ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసింది. డిపో మేనేజరు బి.వాణి గురువారం మాట్లాడుతూ ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాల్ టిక్కెట్ ఉన్న ప్రతి ఒక్కరికి పరీక్షా హాల్ సెంటర్, తిరిగి ఇంటికి చేరేందుకు ఉచిత ప్రయాణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లావిద్యాశాఖ అధికారులతో సంప్రదించి అవసరమైన మేరకు బస్సులు నడపాలని ఆర్టీసీ ఆర్ఎం ఆదేశించారని ఆమె తెలిపారు.

చిన వెంకన్నను దర్శించిన ముప్పిడి


ఆలయంలో నేతలు కార్యకర్తలతో ముప్పిడి

ద్వారకాతిరుమల, మార్చి 14: చినవెంకన్న ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. ఆయనకు మండల పార్టీ నేతలు స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల నుంచి వేదాశీర్వచనం, ప్రసాదాలు పొందారు. గోపాలపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకట్రావును ప్రకటించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత నేత్ర వైద్య పరీక్షల శిబిరం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14: సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల దత్తత గ్రామం వైఎస్సార్ కాలనీలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్రవైద్య పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు ఎస్తేర్‌రాణి, అశోక్, ప్రోగ్రాం ఆఫీసర్లు బ్యూలా స్వరూపరాణి, పూజిత, విజయలక్ష్మి, పాల్గొన్నారు.


పుట్లగట్లగూడెంలో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు


ఏలూరు పాతబస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న బడేటి చంటి

అవినీతి సీఎం జగన్

ఏపీపీఎస్సీ అక్రమాలపై టీడీపీ, జనసేన నిరసన

ఏలూరు టూటౌన్, మార్చి 14: అవినీతి సీఎం జగన్ ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించాడని టీడీపీ ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏపీపీఎస్సీలో అక్రమాలకు నిరసనగా పాత బస్టాండ్ వద్ద టీడీపీ శ్రేణులు గురువారం ధర్నా నిర్వహించారు. చంటి మాట్లాడుతూ సంతలో పశువులను అమ్మినట్లు జగన్ ఏపీపీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకునే స్థాయికి దిగజారాడని అన్నారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలో జగన్ అక్రమాలను హైకోర్టు బహిర్గతం చేసిందన్నారు. ఒక్కో డిప్యూటీ కలెక్టర్ పోస్టు రెండున్నర కోట్లు, డీఎస్పీ పోస్టు కోటిన్నరకు అమ్ముకున్నాడని ఆరోపించారు. జగన్‌కు నైతిక విలువలు ఉంటే హైకోర్టు తీర్పుకు కట్టుబడి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో పెద్దిబోయిన శివప్రసాద్, ఎం.పార్థసారధి, చోడే వెంకటరత్నం, మారం హనుమంతరావు, బాలాజీ, నాయుడు సోము, భీమవరపు సురేష్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకుని అక్రమాలకు పాల్పడిందని టీడీపీ, జనసేన నేతలు విమర్శించారు. ఏపీపీఎస్సీ అక్రమాలను సాక్షాత్తు హైకోర్టు బహిర్గతం చేసిందని, అవినీతికి పాల్పడిన అధికారులను, ప్రభుత్వ పెద్దలను తక్షణమే అరెస్టు చేయాలంటూ జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెంలో సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పారేపల్లి మనిబాబు, ప్రగడ వెంకటేశ్వరరావు, ఆకుల రాకేష్, గిరిజ, ఉమామహేశ్వరి, విజయ్‌కుమార్, కుక్కల మాధవరావు, కరుటూరి రమాదేవి, గోలి అనిల్, చాత్రాతి గణేష్, శీలం వెంకటరాజు, పగడం సౌభాగ్యవతి, ఇంద్రాణి, గుళ్లపూడి శ్రీదేవి, నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్

ఏలూరు టూటౌన్: రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ అని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 24వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్రలో చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకే కలసికట్టుగా ముందుకు వెళుతున్నామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. జగన్‌కు చెక్‌పెట్టేందుకు మూడుపార్టీల కూటమిని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో గూడవల్లి వాసు, విజయలక్ష్మి, లంకపల్లి మాణిక్యాలరావు, భీమవరపు సురేష్, చోడే బాలు, మట్టా రంజిత్, సీహెచ్ గణేశ్, ఎస్.రాము, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా తరలివస్తున్న చింతమనేని ప్రభాకర్ అనుచరులు, కార్యకర్తలు

నాగులగూడెంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

జంగారెడ్డిగూడెం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. నాగులగూడెంలో వైసీపీకి చెందిన 20 మంది టీడీపీలో చేరడంతో రోషన్ కుమార్ టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. నాగులగూడెంలో పేద దళిత కుటుంబాలకు రోషన్ కుమార్ ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన చిలకా ఇమ్మాన్యుయేల్, మాదాసు రామయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి కొంత నగదు అందజేశారు. కళాశాల విద్యార్థులకు వాలీ బాల్‌కిట్ అందించడానికి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకే కూటమి : చింతమనేని

ఏలూరు టూటౌన్: జగన్ ఆరాచక పాలనను అంతమొందించేందుకే టీడీపీ జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిందని, ప్రజలు అర్థం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూటమి దెందులూరు నియోజకవర్గ అభ్యర్థిగా చంద్రబాబు తన పేరును ప్రకటించటంతో దుగ్గిరాల నుంచి వందలాది మంది టీడీపీ కార్యకర్తలతో ర్యాలీగా ఏలూరు చేరుకున్నారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎన్‌టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి ఏర్పాటుతో జగన్ ఓటమి ఖాయమైందన్నారు. రెండు నెలల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు.

ఈబీసీ నేస్తంలో రూ.18.99 కోట్లు జమ


నమూనా చెక్ అందజేస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 14: వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద జిల్లాలో 12,660 మంది అగ్రవర్ణ పేద మహిళల ఖాతాల్లో రూ.18.99 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి గురువారం సొమ్ము జమ చేసిన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్షప్రసారం ద్వారా కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నాగరాణి, పలువురు అధికారులు తిలకించారు. అనంతరం జిల్లాలోని సంబంధిత లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అందించారు.

దివ్యాంగునికి ఉద్యోగం కేటాయింపు

ఏలూరు కలెక్టరేట్, మార్చి 14: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకాల్లో భాగంగా బుట్టాయిగూడెం మండలం కోయ రాజుమండ్రికి చెందిన దివ్యాంగుడు బానోతు జశ్వంత్‌నాయక్‌ను కమాటి పోస్టులో నియమిస్తూ కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ గురువారం ఉత్తర్వులు అందజేశారు. విభిన్న ప్రతిభావంతులశాఖ ఏడీ రాకడ మణి తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా ప్రకటనలు చూసి మోసపోవద్దు


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

ఏలూరు క్రైం, మార్చి 14: సోషల్ మీడియా ప్రకటనలు చూసి ఎక్కువ మంది మోసపోతున్నారని జిల్లా సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బీహెచ్ వెంకటేశ్వర్లు, ఏలూరు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల ఫోన్ కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరిట ఆశ చూపించి మోసాలు చేస్తున్నారన్నారు. పార్ట్‌టైమ్ జాబ్ పేరిట వచ్చే లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఫోన్‌లో గోప్యమైన సమాచారాన్ని తస్కరించి బ్లాక్ మెయిల్ చేస్తారన్నారు. ఎవరైనా ఇలాంటి మెస్సేజ్‌లు వస్తే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ సెల్ ఎస్ఐ మధురాజా, ఏలూరు రూరల్ ఎస్ఐ రాజారెడ్డి, మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

'పది' హాల్‌టిక్కెట్ల లోపాలు పరిష్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బాలబాలికల హాల్‌టిక్కెట్లు అస్పష్టంగా జారీ కావడంతో విద్యార్థులు గందరగోళంలో పడ్డారు. అధికారులు జోక్యం చేసుకుని లోపాలు సవరించారు. ఏలూరులోని రెండు పరీక్షా కేంద్రాల చిరునామా హాల్‌టిక్కెట్‌లో ఇవ్వలేదు. పరీక్షా కేంద్రం / స్కూలు పేరు తప్ప చిరునామా లేదు. విద్యార్థులు, తల్లితండ్రుల ఆందోళన సోషల్ మీడియాలో గురువారం వైరల్ కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. 51017 పరీక్షాకేంద్రం (రెగ్యులర్) ఏలూరు రామచంద్రరావుపేట వెంకటేశ్వరస్వామిగుడి సమీపంలోని నారాయణ ఇంగ్లీషుమీడియం స్కూలు, 51006 పరీక్షాకేంద్రం(ప్రైవేటు) ఏలూరు గవరవరం శ్రీ చైతన్య స్కూలుగా పేర్కొంటూ హాల్ టిక్కెట్లను సవరించి వెబ్‌సైట్‌లో ఉంచినట్టు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగా ఈ పరిస్థితి తలెత్తిందని బావిస్తున్నామన్నారు. గుర్తించిన వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు తెలియజేశామని, వెంటనే సవరించినట్లు వివరించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసి సంతకంచేసి విద్యార్థులకు అందజేయాలన్నారు.

నేడు ఎంప్లాయీస్ గ్రీవెన్స్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలోని ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంప్లాయీస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ గురువారం తెలిపారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి సంబంధించిన గ్రీవెన్స్ ఏవైనా ఉంటే దరఖాస్తులో పొందుపరిచి అర్జీదారు వారి సీఎఫ్‌ఎంఎస్ఐడి, ఎంప్లాయ్ గుర్తింపు నెంబరు, ఆధార్‌కార్డు నెంబర్‌లతో ఎంప్లాయీస్ గ్రీవెన్స్‌కు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

పంచాయతీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


వినతిపత్రం అందిస్తున్న సంఘ నాయకులు

పోలవరం, మార్చి 14: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపాల్ కోరారు. ఆయన ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు సెక్రటేరియట్‌లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి అరవపాల్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు బంగారు కృష్ణ మాట్లాడుతూ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల టెండరు విధానాన్ని రద్దు చేసి, పని చేస్తున్న కొనసాగించాలని 2015లో హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. హైకోర్టు తీర్పును రాష్ట్ర ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదన్నారు. కనీస వేతన చట్టం అమలు చేయడం లేదని, ఉద్యోగ భద్రత కల్పించలేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సంఘ నాయకులు ముప్పిడి రవికుమార్, ధనాల ఫణికుమార్, తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలి మృతిపై విచారణ జరిపించాలి


వినతిపత్రం ఇస్తున్న విశ్వబ్రాహ్మణులు

ఉంగుటూరు, మార్చి 14: గొంతి గీతాంజలి మృతిపై దర్యాప్తు జరిపి తగిన న్యాయం చేయాలని విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం ఆందోళన చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయం, చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో వినతిపత్రం ఇచ్చారు. మండల అధ్యక్షుడు పట్నాల శంకరాచార్యులు, గౌరవాధ్యక్షుడు గనుమోజు వెంకట రమణ, లావేటి శ్రీను, అనపర్తి సుబ్రహ్మణ్యం, లావేటి చిన్నా, కర్రి పాండు, ముసినాడ జయలక్ష్మి, కోమలి, సుందర మాణిక్యం, బాణాల శ్రీనివాసాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం కార్యాలయంలో కార్ల్‌మార్క్స్ వర్ధంతి

ఏలూరు టూటౌన్, మార్చి 14: కమ్యూనిస్టు సిద్ధాంతకర్త కార్ల్‌మార్క్స్ వర్థంతి సీపీఎం జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నగర అధ్యక్షుడు కిషోర్ మాట్లాడుతూ ప్రపంచంలో కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అందించిన గొప్ప తత్త్వవేత్త కార్ల్‌మార్క్స్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, సాయిబాబు, జగన్నాథరావు, ఎస్.సత్యనారాయణ, జీ.కోటేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సెయింట్ థెరిస్సాలో మినీ జాబ్‌మేళా

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రాంగణంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ మెర్సీ గురువారం తెలిపారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, పీజీ విద్యార్హతలున్న మహిళలు, పురుషులు హాజరుకావచ్చునన్నారు. ఫార్మా, ఇన్సూరెన్స్ రంగాల్లో ప్రముఖ కంపెనీలు మొత్తం 520 ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాయన్నారు.

పంట వివరాలు నమోదు చేసుకోండి

పోలవరం, మార్చి 14 : మండలంలో రైతులు పంట వివరాలు రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని ఏవో కె.రాంబాబు సూచించారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో రబీ సీజన్‌లో 1,395 మంది రైతులకు 2,894 ఎకరాల వరి, 2,232 రైతులకు 4,826 ఎకరాల మొక్కజొన్న, మిగతా పంటలకు సంబంధించి 3,687 మంది రైతులకు 7,876 ఎకరాలకు ఈ-పంట నమోదు చేశామన్నారు. రైతులు పంట వివరాలు, సాగు విస్తీర్ణం, సర్వే నెంబర్లు తదితర వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద నమోదు చేసుకుని రశీదులు పొందాలని సూచించారు.

సారా తయారు చేస్తున్న ఒకరి అరెస్టు

టి.నరసాపురం, మార్చి 14 : సారా తయారు చేస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. తెడ్లం గ్రామంలో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో గురువారం తన సిబ్బందితో కలసి దాడి చేసినట్లు వివరించారు. సారా తయారు చేసే సామగ్రి, 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్నికల సంఘం సూచనలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో అబ్బయ్య

చింతలపూడి, మార్చి 14: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల సంఘం సూచనలు, నిబంధనలను ప్రతి రాజకీయపార్టీ అనుసరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి కె.అబ్బయ్య సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తరువాత అనుసరించాల్సిన మోడల్ కోడ్ వివరించారు. సమావేశాల్లో జెండాలు కట్టే విషయంలో కూడా అనుమతి తీసుకోవాలన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో టీచర్లకు ఈవీఎంల నిర్వహణ, పోలింగ్ రోజు చేపట్టాల్సిన బాధ్యతలపై విజయానంద్ టీమ్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. నాలుగు మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి


శిక్షణ ఇస్తున్న ఆర్వో ఖాజావలి

ఉంగుటూరు, మార్చి 14: విధి నిర్వహణలో నోడల్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, విధులు సక్రమంగా నిర్వహించాలని నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఖాజా వలి సూచించారు. నియోజకవర్గంలో నోడల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై గురువారం శిక్షణ ఇచ్చారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

క్రీస్తు చూపిన బాటలో సాగాలి

పెదవేగి, మార్చి 14: క్రీస్తు చూపిన బాటలో నడవాలని ఖమ్మం మేత్రాసనం, అయ్యవారిగూడెం విచారణ గురువు ఫాదర్ ఐజాక్ తెలిపారు. న్యాయంపల్లి ఆరోగ్య మాత చర్చిలో మూడు రోజుల క్రీస్తు మహాసభలు గురువారం ప్రారంభించారు. ఐజక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన బాటలో పయనిస్తే జీవితం పరిపూర్ణం అవుతుందని, మానవుడు పరలోక ప్రాప్తిని అందుకుంటారని ఆయన తెలిపారు. ములగలంపాడు విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ జీవరత్నం దివ్యబలి పూజ అర్పించారు. న్యాయంపల్లి విచారణ గురువు ఫాదర్ బాలస్వామి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన దీక్షాదారులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాపై శ్రద్ధ వహించాలి

టి.నరసాపురం, మార్చి 14: గ్రామాల్లో మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జల జీవన్ మిషన్ నిపుణులు బాలముని, ప్రకాష్ చంద్ర సమర్ అన్నారు. తిరుమలదేవిపేటలో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాలను పరిశీలించారు. సర్పంచ్ గొల్లపల్లి సరోజిని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. డీఎల్‌పీవో ఎండి రజావుల్లా, డీఈఈ సురేష్, ఏఈ రామకృష్ణ, డీపీఎం నవాజ్, జిల్లా కోఆర్డినేటర్లు ఎ.శ్రీనివాసు, బీవీవీ.వరప్రసాద్, స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ ప్రేమ్ జిత్, ల్యాబ్ కోఆర్డినేటర్ పట్టాభి, గ్రామ కార్యదర్శి శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.

నెక్లెస్ బండ్ పునరుద్ధరణ పనులు

పోలవరం, మార్చి 14: పోలవరం గ్రామానికి రక్షణగా వేసిన నెక్లెస్ బండ్ కుంగిపోయి ప్రమాదకరంగా మారిందని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనాలపై అధికారులు స్పందించారు. ఆంజనేయస్వామి ఆలయం రేవు వద్ద నెక్లెస్ బండ్ పనులు ప్రారంభించారు. గత ఏడాది జరిగిన పనులలో 10 మీటర్ల మేర పనులు మిగిలిపోయాయని, వాటిని పూర్తి చేస్తున్నామని సంబంధిత అధికారులు తెలిపారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు ఎడ్యుకేషన్ :** స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చర్మవ్యాధులు, జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ సుబ్బారావు విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.
- **ఏలూరు రూరల్ :** శనివారపుపేటలోని ఫ్రెండ్‌ఆఫ్ గార్డ్ చర్చి ఆధ్వర్యంలో, ఆశ్రమం ఆసుపత్రి సౌజన్యంతో ఆళ్ళనాని కాలనీ చెరువుగట్టు వద్ద ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఏపీపీఎఫ్ రాష్ట్రప్రధాన కార్యదర్శి రెవరెండ్ జీవన్‌కుమార్ ప్రారంభించారు. సుమారు 400మందిని వైద్యులు పరీక్షించి మందులు పంపిణీ చేశారు.
- ఏలూరు 6వ డివిజన్ ఎంపీ రాజు కాలనీ బగ్గయ్యపేటలో కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ఆళ్ళ నాని ప్రారంభించారు. ఈడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, కార్పొరేటర్ సుంకర చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.
- **పెదపాడు :** విజయవాడలో జరిగిన ఆల్ ఇండియా చిల్డ్రన్, యూత్ కాంపిటీషన్‌లో అప్పనవీడు హైస్కూల్‌కు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొనగా, చిత్రకళ పోటీల్లో పలువురు బంగారు పతకాలు సాధించినట్లుగా హెచ్.ఎం. టి.పుష్పవతి తెలిపారు.
- **చింతలపూడి :** పట్టణంలోని బట్టువారిగూడెం సమస్యలు పరిష్కరిస్తామని వైసీపీ నాయకులు కె.విజయరాజు హామీ ఇచ్చారు. చెంచమరాజు ఆధ్వర్యంలో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ నీరజ, పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.
- **లింగపాలెం :** కె.గోకవరం పాఠశాల విద్యార్థులకు టీడీపీ నాయకులు పుస్తకాలు పంపిణీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు మండవ ప్రసాద్ పుస్తకాలు, పెన్నులు పరీక్షకు అవసరమైన ఇతర సామాగ్రి అందించారు. సర్పంచ్ యలమంచి శ్రీనివాసరావు, కొల్లి ప్రసాద్, హెచ్‌ఎం నరసింహారావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- లింగపాలెం మండలం అయ్యప్పరాజుగూడెం ప్రగతిపురం కాలనీ పాఠశాలను ఎంఈవో రామారావు ఆయన తనిఖీ చేశారు. మధ్యాహ్నం భోజనాన్ని ఆయన పరిశీలించారు. భోజనంలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.
- **భీమడోలు :** వ్యక్తిగత కారణాలతో రాష్ట్ర ఐటీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పదవి నుంచి వైదొలుగుతున్నానని బాలానందం తెలిపారు. పార్టీలో కార్యకర్తగా కొనసాగుతానని తెలిపారు.
- **టి.నరసాపురం :** బొర్రంపాలెం కోదండ రామస్వామి ఆలయ చైర్మన్‌గా కంభంపాటి జోగేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా చంద్రు అనురాధ, సభ్యులుగా గుమ్మళ్ల వెంకటేశ్వరరావు, నిమ్మల రమాదేవి, ఆకురాతి శివ, పొట్లేళ్ల భాగ్యలక్ష్మి, మల్కిపురం శ్రీనివాస్‌లచే ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో గ్రామనాయకులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




బుట్టాయగూడెం తహసీల్దార్‌కు వినతిపత్రం, చింతలపూడి బోసుబొమ్మ సెంటర్, పోలవరంలో కార్మిక సంఘాలు వామపక్షాల నిరసన

పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలి

బుట్టాయగూడెం, మార్చి 14: రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని కోరుతూ అఖిలభారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. పీవైఎల్ నాయకుడు టి.బాబురావు అధ్యక్షతన జరిగిన సభలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్ముల సురేష్ మాట్లాడుతూ ప్రధాని మోదీ వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పంటలకు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని కారం రాఘవ డిమాండ్ చేశారు. తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రాన్ని అందజేశారు. వెట్టి భారతి, బి.వినోద్, వి.వెంకటేశ్వరావు, భాషా రంపాలరాజు, కె.కన్నారావు, కె.సోమరాజు, పి.ముకరాజు, జి.పండు, కొమరం నాగార్జున పాల్గొన్నారు.

● చింతలపూడి: ఢిల్లీలో రైతుల పోరాటానికి మద్దతుగా బోసుబొమ్మ సెంటర్లో రైతుసంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. రైతులకు ఇచ్చిన హామీలను కేంద్రం అమలు చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎస్‌కె కాలీష, దొండా కృష్ణ, కంకిపాటి బుచ్చిబాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ.సత్యనారాయణ, డి.రంగనాథ్, టి.బాబు, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం: రైతు రుణమాఫీ చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని రైతు కూలీ సంఘం, గిరిజన సంఘం డిమాండ్ చేసింది. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కుంజం రామారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సమగ్ర పునరావాసాన్ని కల్పించాలని కోరారు. గిరిజన సంఘం నాయకులు సవలం రాంబాబు, మిడియం రవిదొర, దాడి రాముడు నాయకత్వం వహించారు.

● కుక్కునూరు: ప్రగతిశీల రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ అచ్యుత కుమారికి వినతి పత్రాన్ని ఇచ్చారు. రైతు సంఘం నాయకుడు ఎస్‌కె గౌస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాసినేని సత్యనారాయణ, మడివి మహేష్, మడకం భద్రయ్య, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

● ఉంగుటూరు: మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై రైతులు, కౌలు రైతులు నిరసన తెలిపారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తేవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. చేశారు. కొర్ని అప్పారావు, ెజ్జు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడతూ కౌలు రైతులకు నెలకు రూ.6వేల పింఛన్ ఇవ్వాలన్నారు. చిత్తా వెంకటేశ్వరరావు, అల్లు గోవింద్, పి.బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: ఢిల్లీలో రైతులు చేస్తున్న ధర్నాకు మద్దతుగా ఎం.నాగులపల్లిలో రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లింగరాజు మాట్లాడుతూ కనీస మద్దతు ధర చట్టంపై మోదీ ప్రభుత్వం రెండేళ్ల క్రితమే రైతులకు హామీ ఇచ్చి అమలు చేయలేదన్నారు. రైతు సంఘ నేతలు, కట్టా బాస్కరరావు, జి.ప్రసాదరావు, రాంబాబు, నాగరాజు, పూర్ణ చంద్రరావు, వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే డ్రైనేజి వ్యవస్థ మెరుగుదల


సమస్యలు తెలుసుకుంటున్న పార్థసారథి

నూజివీడు, మార్చి 14:టీడీపీ అధికారంలోకి రాగానే పట్టణంలో డ్రైనేజి వ్యవస్థను అభివృద్ధి పరిచేందుకు చర్యలు చేపడతానని నూజివీడు టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు. పట్టణంలో 'మన ఇంటికి మన సారథి' కార్యక్రమంలో వార్డు ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పట్టణంలో దాదాపు 80 శాతం రహ దారులు సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే మిగిలిన రోడ్లతోపాటు డ్రెయిన్లను అభివృద్ధి చేస్తామన్నారు. మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ చెరుకూరి దుర్గాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకులు నూతక్కివేణుగోపాలరావు, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బర్మాఫణిబాబు, ఉమ్మడి కృష్ణా జిల్లా జనసేన అధికారప్రతినిధి మరీదు శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సరోజినికి పరామర్శ..

చాట్రాయి/ముసునూరు: నియోజకవర్గ తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి మందలపు జగదీష్ తల్లి సరోజిని అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది చీపురుగూడెంలో ఇంటికి రాగా, పార్థసారధి బుధవారం రాత్రి ఆమెను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. కోటపాడులో నిర్మిస్తున్న రామాలయానికి టీడీపీ మండలాధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి ప్రకటించిన రూ.25 వేల విరాళం చెక్‌ను పార్థసారధి చేతుల మీదుగా కమిటీ సభ్యులకు అందజేశారు. గురువారం రాత్రి గోపవరంలో జరిగిన టీడీపీ సూపర్ సిక్స్ పథకాలు, గ్రామస్థుల ఆత్మీయ సమావేశానికి పార్థసారధి హజరై ప్రసంగించారు.

ముద్దరబోయిన ఆత్మీయ సమావేశం


అభివాదం చేస్తున్న ముద్దరబోయిన

నూజివీడు, మార్చి 14 : రక్త సంబంధం లేకపోయినా కుటుంబ సభ్యుల్లా కలిసి మెలిసి ఉండే వారు బలహీన వర్గాల వారేనని, ఆ వర్గాల్లో జన్మించిన వాడిగా గ్రూపులు కట్టడం తనకు చేతకాదని, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. పోతురెడ్డిపల్లిలో ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్టడుగువర్గాల ప్రజలే తనకు అండ అని, ఓటు విలువ తెలుసుకుని ప్రతిఒక్కరూ ముందుకు సాగాలన్నారు. బడుగు, బలహీనవర్గాల అండగతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలుస్తానని చెప్పారు.

అంబేద్కర్ విగ్రహానికి మెట్ల నిర్మాణం

చాట్రాయి, మార్చి 14: చిన్నంపేట దళితవాడలోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య రూ.50 వేలతో మెట్లు నిర్మించారు. మెట్లు లేకపోవటం ఇబ్బందులు పడుతున్న స్థానికులు దీనిని నిర్మించాలని స్థానికులు కోరగా ఆయన స్పందించి నిర్మించారు.

రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలి


నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

నూజివీడు టౌన్, మార్చి 14 : రైతులకు కనీస మద్దతు ధర కల్పించేందుకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ రైతు, కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు కనీస మద్దతు ధర ఇవ్వాలని ఢిల్లీ కేంద్రంగా నిరసనలు తెలుపుతున్నారన్నారు. దీనిపై కేంద్రం స్పందించి గతంలో ఇచ్చిన హామీలను, కనీస మద్దతు ధరను కల్పించి చట్టం తీసుకురావాలన్నారు. ఏఐటీ యూసీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకటరామారావు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ ఏలూరు జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

అప్పటి వరకు నిరసన దీక్షలు ఆపం


రిలే దీక్షలు చేస్తున్న కాలనీ వాసులు

ముదినేపల్లి, మార్చి 14 : తమ కాలనీలో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ పెయ్యేరు వైఎస్ఆర్ కాలనీ వాసులు చేపట్టిన రిలే దీక్షలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఈవోపీఆర్డీ డి.లక్ష్మీనారాయణ కాలనీ వాసులతో చర్చలు జరిపారు. కాలనీ నుంచి మురుగునీటిని బయటికి పంపే ఇప్పటికిప్పుడు అవకాశాలు లేనందున తాత్కాలిక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పనులు చేపట్టే వరకు తాము రిలే దీక్షలు విరమించేది లేదని బీజేపీ నాయకుడు ఫణీంద్రతోపాటు కాలనీ వాసులు స్పష్టం చేశారు.

రేపు లోక్‌అదాలత్

నూజివీడు టౌన్, మార్చి 14: నూజివీడు కోర్టు హాల్ ప్రాంగణంలో ఈ నెల 16వ తేదీ శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు 15వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఏ.నాగశైలజ తెలిపారు. పరిష్కరించదగ్గ సివిల్ కేసులు, క్రిమినల్ కేసులు, చెక్ బౌన్స్, మోటారు యాక్సిడెంట్ నష్టపరిహార తదితర కేసులపై కక్షిదారులు పరిష్కరించేలా చేయాలన్నారు.

రైతులను ప్రోత్సహిస్తా

ముదినేపల్లి, మార్చి 14 : పెదగొన్నూరులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు గురువారం ప్రజా ఆశీర్వాద యాత్రను నిర్వహించారు. రైతులు, చేతి వృత్తులపై ఆధారపడిన వారిని ప్రోత్సహిస్తానని తెలిపారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జడ్పీటీసీ ఈడే వెంకటేశ్వరమ్మ, కోమటి విష్ణు వర్ధన్, దొంతు నాగభూషణం, సర్పంచ్ తాడంకి శిరీష పాల్గొన్నారు. చెవి వ్యాధితో బాధపడుతున్న పెనుమల్లికి చెందిన ఆరేళ్ల చిన్నారి కాగిత మహేష్‌కు వైద్య ఖర్చులకు మంజూరైన రూ.5 లక్షల సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే దూలం అందజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

నూజివీడు టౌన్, మార్చి 14: పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్‌అప్పారావు శంకుస్థాపనలు చేశారు. మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కాలి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం


నూజివీడులో జెండా ఆవిష్కరణలో నాయకులు,

నూజివీడు టౌన్, మార్చి 14: జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. నూజివీడు పార్టీ కార్యాలయం వద్ద జనసేన జెండాను నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఆవిష్కరించారు. రావిచర్ల వేడుకల్లో టీడీపీ కూటమి అభ్యర్థి కొలుసు పార్థసారథి, శివరామకృష్ణ, రమేష్‌బాబు, గోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


కోరుకొల్లులో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు

కలిదిండి : కోరుకొల్లులో జనసేన ఆవిర్భావ కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం సాధిస్తుందని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి, నాయకులు సిరిపురపు రాజబాబు, బట్టు లీలా కనకదుర్గ, కేశిరెడ్డి బలరామ్, వలవల రమేష్, నున్న సుబ్రహ్మణ్యం, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీ నాయకులకు అవగాహన

కైకలూరు, మార్చి 14: సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులకు నామినేషన్, పోలింగ్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కైకలూరు తహసీల్దార్ ఎస్‌పోతురాజు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు తహసీల్దార్ కార్యక్రమంలో సమావేశాన్ని నిర్వహిస్తారని అన్ని రాజకీయ పార్టీల నాయకులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

అవినీతి సీఎం జగన్

ఏపీపీఎస్సీ అక్రమాలపై టీడీపీ, జనసేన నిరసన


పుట్లగట్లగూడెంలో నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన నాయకులు


ఏలూరు పాతబస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న బడేటి చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 14: అవినీతి సీఎం జగన్ ఏపీపీఎస్సీని భ్రష్టు పట్టించాడని టీడీపీ ఏలూరు నియోజకవర్గ అభ్యర్థి బడేటి చంటి అన్నారు. ఏపీపీఎస్సీలో అక్రమాలకు నిరసనగా పాత బస్టాండ్ వద్ద టీడీపీ శ్రేణులు గురువారం ధర్నా నిర్వహించారు. చంటి మాట్లాడుతూ సంతలో పశువులను అమ్మినట్లు జగన్ ఏపీపీఎస్సీలో ఉద్యోగాలు అమ్ముకునే స్థాయికి దిగజారాడని అన్నారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలో జగన్ అక్రమాలను హైకోర్టు బహిర్గతం చేసిందన్నారు. ఒక్కొ డిప్యూటీ కలెక్టర్ పోస్టు రెండున్నర కోట్లు, డీఎస్పీ పోస్టు కోటిన్నరకు అమ్ముకున్నాడని ఆరోపించారు. జగన్‌కు నైతిక విలువలు ఉంటే హైకోర్టు తీర్పుకు కట్టుబడి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో పెద్దిబోయిన శివప్రసాద్, ఎం.పార్థసారధి, చోడే వెంకటరత్నం, మారం హనుమంతరావు, బాలాజీ, నాయుడు సోము, భీమవరపు సురేష్, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: వైసీపీ ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఉద్యోగాలను అమ్ముకుని అక్రమాలకు పాల్పడిందని టీడీపీ, జనసేన నేతలు విమర్శించారు. ఏపీపీఎస్సీ అక్రమాలను సాక్షాత్తు హైకోర్టు బహిర్గతం చేసిందని, అవినీతికి పాల్పడిన అధికారులను, ప్రభుత్వ పెద్దలను తక్షణమే అరెస్టు చేయాలంటూ జంగారెడ్డిగూడెం మండలం పుట్లగట్లగూడెంలో సొంగా రోషన్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ, పారేపల్లి మనిబాబు, ప్రగడ వెంకటేశ్వరరావు, ఆకుల రాకేష్, గిరిజ, ఉమామహేశ్వరి, విజయ్‌కుమార్, కుక్కల మాధవరావు, కరుటూరి రమాదేవి, గోలి అనిల్, చాట్రాతి గణేష్, శీలం వెంకటరాజు, పగడం సౌభాగ్యవతి, ఇంద్రాణి, గుళ్లపూడి శ్రీదేవి, నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్

ఏలూరు టూటౌన్: రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడిస్తేనే రాష్ట్రానికి భవిష్యత్ అని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బడేటి చంటి అన్నారు. 24వ డివిజన్‌లో ప్రజాసంకల్ప యాత్రలో చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకే కలసికట్టుగా ముందుకు వెళుతున్నామన్నారు. ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపండిందన్నారు. జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. జగన్‌కు చెక్‌పెట్టేందుకు మూడుపార్టీల కూటమిని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో గూడవల్లి వాసు, విజయలక్ష్మి, లంకపల్లి మాణిక్యాలరావు, భీమవరపు సురేష్, చోడే బాలు, మట్టా రంజిత్, సీహెచ్ గణేశ్, ఎస్.రాము, తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీగా ఏలూరు తరలివెళ్లిన చింతమనేని అనుచరులు, కార్యకర్తలు

నాగులగూడెంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

జంగారెడ్డిగూడెం: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సొంగ రోషన్ కుమార్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. నాగులగూడెంలో వైసీపీ కి చెందిన 20 మంది టీడీపీలో చేరడంతో రోషన్ కుమార్ టీడీపీ కండువా కప్పి ఆహ్వానించారు. నాగులగూడెంలో పేద దళిత కుటుంబాలకు రోషన్ కుమార్ ఆర్థిక సహాయం చేశారు. గ్రామానికి చెందిన చిలకా ఇమ్మన్యుయేల్, మాదాసు రామయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి కొంత నగదు అందజేశారు. కళాశాల విద్యార్థులకు వాలీ బాల్‌కిట్ అందించడానికి సాయం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

జగన్‌ను సాగనంపేందుకే కూటమి : చింతమనేని

ఏలూరు టూటౌన్: జగన్ ఆరాచక పాలనను అంతమొందించేందుకే టీడీపీ జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిందని, ప్రజలు అర్థం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూటమి దెందులూరు నియోజకవర్గ అభ్యర్థిగా చంద్రబాబు తన పేరును ప్రకటించటంతో దుగ్గిరాల నుంచి వందలాది మంది టీడీపీ కార్యకర్తలతో ర్యాలీగా ఏలూరు చేరుకున్నారు. ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఎన్‌టీ రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కూటమి ఏర్పాటుతో జగన్ ఓటమి ఖాయమైందన్నారు. రెండు నెలల్లో కూటమి ప్రభుత్వం ఏర్పాటవుతుందన్నారు.

సోషల్ మీడియా ప్రకటనలు చూసి మోసపోవద్దు


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు

ఏలూరు క్రైం, మార్చి 14: సోషల్ మీడియా ప్రకటనలు చూసి ఎక్కువ మంది మోసపోతున్నారని జిల్లా సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ బీహెచ్ వెంకటేశ్వర్లు, ఏలూరు ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు ఆశ్రం మెడికల్ కాలేజీ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాల న్నారు. అపరిచితుల ఫోన్ కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించవద్దన్నారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగం పేరిట ఆశ చూపించి మోసాలు చేస్తున్నారన్నారు. పార్ట్‌టైమ్ జాబ్ పేరిట వచ్చే లింకులను క్లిక్ చేయవద్దన్నారు. ఫోన్‌లో గోప్యమైన సమాచారాన్ని తస్కరించి బ్లాక్ మెయిల్ చేస్తారన్నారు. ఎవరైనా ఇలాంటి మెసేజ్‌లు వస్తే వెంటనే సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. లేదా www.cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ సెల్ ఎస్ఐ మధురాజా, రూరల్ ఎస్ఐ రాజారెడ్డి, మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎంప్లాయిస్ గ్రీవెన్స్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 14: జిల్లాలోని ఉద్యోగుల సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించేందుకు కలెక్టరేట్‌లో శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ గురువారం తెలి పారు. వివిధ రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు వారికి సంబం ధించిన గ్రీవెన్స్ ఏవైనా ఉంటే దరఖాస్తుల్లో పొందుపరిచి అర్జీదారు వారి సీఎఫ్‌ఎంఎస్‌ఐడి, ఎంప్లాయ్ గుర్తింపు నెంబరు, ఆధార్‌కార్డు నెంబర్‌లతో ఎంప్లాయిస్ గ్రీవెన్స్‌కు హాజరుకావాలని కలెక్టర్ సూచించారు.

'పది' హాల్‌టిక్కెట్ల లోపాలు పరిష్కారం

ఏలూరు ఎడ్యుకేషన్, మార్చి 14 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో బాలబాలికల హాల్‌టిక్కెట్లు అస్పష్టంగా జారీ కావడంతో విద్యార్థులు గందరగోళంలో పడ్డారు. అధికారులు జోక్యం చేసుకుని లోపాలు సవరించారు. ఏలూరులోని రెండు పరీక్షా కేంద్రాల చిరునామా హాల్‌టిక్కెట్‌లో ఇవ్వలేదు. పరీక్షా కేంద్రం / స్కూలు పేరు తప్ప చిరునామా లేదు. విద్యార్థులు, తల్లితండ్రుల ఆందోళన సోషల్ మీడియాలో గురువారం వైరల్ కావడంతో అధికారులు అప్రమత్తం అయ్యారు. 51017 పరీక్షా కేంద్రం (రెగ్యులర్) ఏలూరు రామచంద్రరావుపేట వెంకటేశ్వరస్వామిగుడి సమీపంలోని నారాయణ ఇంగ్లీషుమీడియం స్కూలు, 51006 పరీక్షా కేంద్రం(ప్రైవేటు) ఏలూరు గవరవరం శ్రీ చైతన్య స్కూలుగా పేర్కొంటూ హాల్ టిక్కెట్లను సవరించి వెబ్‌సైట్‌లో ఉంచినట్టు డీఈవో ఎస్.అబ్రహం తెలిపారు. సాంకేతిక సమస్య కారణంగా ఈ పరిస్థితి తలెత్తిం దని బావిస్తున్నామన్నారు. గుర్తించిన వెంటనే ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు తెలియజేశామని, వెంటనే సవరించినట్లు వివరించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు డౌన్‌లోడ్ చేసి సంతకంచేసి విద్యార్థులకు అందజేయాలన్నారు.

ఈబీసీ నేస్తంలో రూ.18.99 కోట్లు జమ


నమూనా చెక్ అందజేస్తున్న కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, మార్చి 14: వైఎస్సార్ ఈబీసీ నేస్తం కింద జిల్లాలో 12,660 మంది అగ్రవర్ణ పేద మహిళల ఖాతాల్లో రూ.18.99 కోట్లు ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ తెలిపారు. సీఎం జగన్మోహన్ రెడ్డి గురువారం సొమ్ము జమచేసిన కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లో ప్రత్యక్షప్రసారం ద్వారా కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, బీసీ కార్పొరేషన్ ఈడీ పుష్పలత, జిల్లా బీసీ సంక్షేమ అధికారి నాగరాణి, పలువురు అధికారులు తిలకించారు. అనం తరం జిల్లాలోని సంబంధిత లబ్ధిదారులకు నమూనా చెక్కును కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ అందించారు.

మేం పవన్ కల్యాణ్ వెంటే : కాపు సంక్షేమ సంఘం

ఏలూరు రూరల్, మార్చి 14: తామంతా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వెంటే ఉంటామని కాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్య క్షుడు పులి శ్రీరాములు అన్నారు. కాపు సంక్షేమ సంఘ ప్రారంభ వేడుకలు బుధవారం నిర్వహించారు. తమకు ఎమ్మెల్యే, ఎంపీ పద వులు వద్దని పవన్‌కల్యాణ్‌కు సలహాలు, సూచనలు ఇవ్వబోమని, లేఖలు కూడా రాయబోమన్నారు. సమాజంలో అన్ని కులాలను కలుపుకుని పెద్దన్న పాత్ర పోషిస్తా మని తెలిపారు. ఇటీవల కొందరు కాపు నేతలు తప్పుదారి పట్టారని వారికి కాపు సామాజికవర్గ మద్దతు లేదన్నారు. జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి విజయానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఎం.చంద్రశేఖర్, కొటారి ఆదిశేషు, పూజారి నిరంజన్, దాశరధి, సామర్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విర్డ్స్‌లో డయాలసిస్ 'ఉచిత' సేవలు



ద్వారకాతిరుమల, మార్చి 14: అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం పురస్క రించుకుని ద్వారకా తిరుమల విర్డ్స్ ఆసుపత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ గాయత్రి మాట్లాడుతూ కిడ్నీ సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే డయాలసిస్, కిడ్నీ మార్పిడిని నియంత్రించవచ్చన్నారు. మూత్రపిండాల సమస్యలకు 40 శాతం మధు మేహం కారణమైతే 30 శాతం మేర రక్తపోటు కారణమవుతోందన్నారు. వీటిని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి చైర్మన్ ఎస్‌వీ సుధాకరరావు మాట్లాడుతూ ఇక్కడ ఆరోగ్యశ్రీ ద్వారా నూతనంగా డయాలసిస్ సేవలను ప్రస్తుతం 40 మంది రోగులకు ఉచితంగా అందచేస్తున్నామన్నారు. వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, సంతోష్‌విహారీ, నాగేంద్ర, సింధు, డయాలసిస్ యూనిట్ సభ్యులు మధుకిరణ్, జాన్, శరత్, డి.రాణి పాల్గొన్నారు.

పెద్దింటమ్మకు ప్రత్యేక పూజలు

కైకలూరు, మార్చి 14: కొల్లేటికోట శ్రీపెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భక్తులు పెద్దఎత్తున అమ్మవారిని దర్శించుకుంటున్నారు. గురువారం కృష్ణా, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులను చెల్లించుకుంటున్నారు. అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, హరిద్రాభిషేకం, పుష్పాభిషేకం, తృతీయవరణ పూజ, తృతీయావరణ కలశార్చన, పుష్పాలంకరణ, దూపసేవ, బాలభోగము, హారతి, మంత్రపుష్పాలు, పంచహారతులు, పూజా కార్యక్రమాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. అమ్మ వారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని భుజబలపట్నం గ్రామానికి చెందిన అల్లూరి జ్ఞానేంద్రవర్మ, నాగలక్ష్మీ, అల్లూరి సురేష్‌రాజు, ఇందు దంపతులు అందజేశారు. ఆలయ అధికారి కేవీ గోపాలరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించి భక్తులకు మంచినీటి సదుపాయాలను కల్పించారు.

జీవధ్వజ, మహాకుంభాభిషేకం మహోత్సవాలు

కైకలూరు, మార్చి 14: గోనెపాడులో శ్రీగంగా పార్వతీ సమేత జల లింగేశ్వర సహిత జీవధ్వజ ప్రతిష్ఠా, మహాకుంభాభిషేకం మహోత్సవాలను గురువారం ప్రారంభించారు. విష్ణుసహస్రనామ పారాయణం, దేవతామూర్తి గ్రామోత్సవాన్ని నిర్వహించారు.

19న చనుబండ రామాలయం భూములు వేలం

చాట్రాయి, మార్చి 14: చనుబండ శ్రీకోదండరామస్వామి ఆలయ భూముల కౌలు వేలం ఈ నెల 19 మంగళవారం ఉదయం దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి తెలిపారు. పూర్తి వివరాలకు దేవాలయంలో సంప్రదించవచ్చునని చెప్పారు.

ఉపాధి పనులను పూర్తి చేయండి

ముసునూరు, మార్చి 14: పెండింగ్‌లో వున్న ఉపాధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ ఎ.రాము ఆదేశించారు. గురువారం చింతలవల్లిలో జరుగుతున్న రైతు వారికుంట నిర్మాణ పనులు, ఉపాధి హామీ ద్వారా వేసిన పండ్ల తోటలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రైతువారి కుంటల వల్ల కలిగే ఉపయోగాలపై రైతులకు అవగహన కల్పించి, ప్రతి పొలంలో రైతువారికుంట ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని పీడీ సూచించారు.

దివ్యాంగునికి ఉద్యోగం కేటాయింపు

ఏలూరు కలెక్టరేట్, మార్చి 14: దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల నియామకాల్లో భాగంగా బుట్టాయిగూడెం మండలం కోయ రాజుమండ్రికి చెందిన దివ్యాంగుడు బానోతు జశ్వంత్‌నాయక్‌ను కమాటి పోస్టులో నియమిస్తూ కలెక్టర్ వై.ప్రసన్నవెంకటేశ్ ఉత్తర్వులు అందజేశారు.

క్రైం కార్నర్

మొన్న తండ్రి.. నేడు పాము కాటుకు కుమార్తె మృతి

కలిదిండి, మార్చి 14 : ఇంటి ఆవరణలో ఆడుకుంటూ ఉండగా.. తొమ్మిదేళ్ల బాలిక గద్దె మహిత దుర్మరణం పాలైంది. కలిదిండి మండలం భాస్కరావుపేటలో బుధవారం ఈ ఘటన జరిగింది. ఆడుతూ కిక్కిస దడి వద్దకు వెళ్లగా దాగి వున్న తాచు పాము బాలికను కాటు వేయడంతో స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు దీనిని గమనించి ఆమెను చికిత్స నిమిత్తం మూల్లంక పీహెచ్‌సీకి తరలించారు. మెరుగైన వైద్యానికి మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. 11 రోజుల క్రితమే బాలిక తండ్రి పాపారావు(42) అనారోగ్యంతో చనిపోవటం కుటుంబసభ్యులు దుఃఖంలో ఉన్నారు. ఈ ఘటన మరింత దుఃఖసాగరంలో మునిగింది. ఏకైక కుమార్తె మృతితో తల్లి, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ రేషన్ బియ్యం పట్టివేత

ఏలూరు క్రైం/ముసునూరు, మార్చి 14 : జిల్లా విజిలెన్సు ఎస్పీ కరణం కుమార్‌కు అందిన సమాచారంతో జిల్లా విజిలెన్సు సీఐ విల్సన్ వారి సిబ్బంది కలిసి తనిఖీలు చేపట్టారు. ఒక బొలెరో వాహనాన్ని తనిఖీ చేసి 19 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముసునూరు మండలం సింహాద్రిపురం వద్ద గురువారం తెల్లవారుజామున వాహనాల తనిఖీలు చేపట్టారు. బొలెరో పికప్ వాహనాన్ని తనిఖీ చేయగా రేషన్ బియ్యం రవాణా జరుగుతున్నట్లు గుర్తించారు. వ్యాన్ యజమాని,డ్రైవర్ అయిన మల్లవెల్లి శివరంగారావును విజిలెన్సు అధికారులు ప్రశ్నించారు. పెదపాడు మండలం దాసరి గూడెంనకు చెందిన నల్లవెల్లి శ్యామ్‌కు చెందిన బియ్యం అని వెల్లడించారు. ముసునూరు, నూజి వీడు మండలాల్లోని పలు రేషన్‌షాపులు, ఎండీయూ వాహనాల్లో తక్కువ ధరకు కొని వాటిని ఎక్కువ ధరలకు అమ్ముతున్నట్లుగా డ్రైవర్ చెప్పాడు. 76 వేల రూపాయల విలువైన రేషన్ బియ్యం, ఆరున్నర లక్షల విలువైన వాహ నాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. మల్లవెల్లి శ్యామ్, మల్లవెల్లి శివ రంగా రావులపై నిత్యావసర వస్తువుల చట్టం 1955 ప్రకారం కేసు నమోదు చేసినట్లుగా తెలిపారు. రెవెన్యూ, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం, మార్చి 14 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావుల ఆదేశాల మేరకు అధికారులు, సిబ్బంది పేకాట స్థావరంపై గురువారం సాయంత్రం దాడి చేశారు. పెదవేగి మండలం భోగాపురం సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్ఈబీ సీఐ సునీల్ కుమార్, ఎస్ఐ శివప్రసాద్, ఎఎస్ఐ పూర్ణ, సిబ్బంది కలిసి దాడి చేశారు. ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి 11,750 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పెదవేగి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లుగా సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

భీమవరంలో ఏడుగురి అరెస్టు

భీమవరం క్రైం, మార్చి 14 : భీమవరం రెండవ పట్టణం పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఏడుగురు వ్యక్తుల్ని అరెస్టు చేసి వారి వద్ద రూ.10,850 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

ఐరన్ షట్టర్ ప్లేట్ల చోరీ.. కేసు నమోదు

పోలవరం, మార్చి 14 : పోలవరం ప్రాజెక్టు కార్మికుల క్యాంపు ప్రాంతంలో ఉన్న షట్టర్ ప్లేట్లు దొంగతనంపై చేశారంటూ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్ కుమార్ తెలిపారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల చలువ పందిళ్ళ కోసం తాటాకు తరలించే నెపంలో తాటాకుల రవాణా చేసే ట్రాక్టర్‌లలో తాటాకుల అడుగున షట్టర్ ప్లేట్లు దాచి తరలిస్తున్న నేపథ్యంలో అందిన సమాచారం మేరకు పోలీసులు రెండు ట్రాక్టర్లను పోలవరం పోలీసు స్టేషన్‌కి తరలించారు. ఈ విషయంపై దొంగతనానికి పాల్పడిన కారింగుల గంగరాజు, పెంటా శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

బాలికను మోసగించిన వ్యక్తి అరెస్టు

భీమవరం క్రైం, మార్చి 14 : బాలికను మాయమాటలతో మోసగించి గర్భవతి చేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భీమవరం పట్టణంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని అదే ప్రాంతంలో కోడి మాంసం విక్రయించే నల్లగంగుల అనిల్‌కుమార్ (38) మాయమాటలతో లొంగ దీసుకున్నాడు. నాలుగు రోజుల క్రితం బాలికకు అనారోగ్యంతో ఉండటంతో ఆసుపత్రికి తీసుకెళ్లగా గర్భవతి అని వైద్యులు తెలిపారన్నారు. బాలికను నిలదీయగా విషయం చెప్పినట్లు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాలికను వైద్య పరీక్షలు కోసం ఆసుపత్రిలో చేర్చారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అడబాల శ్రీను చెప్పారు.

సారా తయారీ.. ఒకరి అరెస్టు

టి.నరసాపురం, మార్చి 14 : సారా తయారు చేస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ డి.దుర్గా మహేశ్వరరావు తెలిపారు. తెడ్లం గ్రామంలో సారా తయారు చేస్తున్నారనే సమాచారంతో గురువారం తన సిబ్బందితో కలసి దాడి చేసినట్లు వివరించారు. సారా తయారు చేసే సామగ్రి, 20 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


ముసునూరులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

ముసునూరు, మార్చి 14: రైతాంగం, కార్మికుల పట్ల కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను తక్షణమే విడనాడాలని సీపీఎం జిల్లా నాయకులు జి.రాజు డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వ పాలనపై ముసునూరులో సీపీఎం గురువారం నిరసన తెలిపింది. రాజు మాట్లాడుతూ మద్దతు ధరల గ్యారంటీ చట్టం, రైతు రుణమాఫీ చట్టాలను తీసుకువచ్చి రైతులను ఆదుకోవాలన్నారు.

దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపాలి

ముసునూరు, మార్చి 14: దివ్యాంగుల్లో మనోధైర్యాన్ని నింపేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ రాధిక అన్నారు. రమణక్కపేట మెయిన్ పాఠశాలలోని భవిత సెంటర్‌ను ఆమె తనిఖీ చేశారు. దివ్యాంగ చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించారు.

కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన

మండవల్లి, మార్చి 14: ఇంగిలిపాకలంక జడ్పీ హైస్కూల్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్, హెచ్‌ఎం జి.గోపాలకృష్ణ, ఐక్యవేదిక కన్వీనర్ ఎల్‌ఎస్ భాస్కరరావు పాల్గొన్నారు.

ఆశ్వగంధ సాగు.. రైతులకు మేలు

ముసునూరు, మార్చి 14: ఆశ్వగంధ సాగు వల్ల రైతులకు ఆర్థికంగా మేలు చేకూరుతుందని ఉద్యాన వన శాఖ శాస్త్రవేత్తలు డాక్టర్ టి.నాగలక్ష్మి, డాక్టర్ డి.అనురాధ తెలిపారు. అన్నారు. కేంద్రం నిధులతో చేపట్టిన ఎస్‌సీఎస్‌పీ పథకంలో భాగంగా గురువారం సూరేపల్లిలో ఆశ్వగంధ సాగుపై రైతులకు అవగహన కల్పించారు. సర్పంచ్ ఎం.సుధారాణి, జి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ ఇ శ్రీనివాసులు

ఎన్నికల విధులపై పోలీసులకు అవగాహన

కైకలూరు, మార్చి 14: ఎన్నికల్లో పోలీస్ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా విధులు నిర్వహించాలని డీఎస్పీ ఈశ్రీనివాసులు అన్నారు. గురువారం కైకలూరు టౌన్, రూరల్ పోలీసుస్టేషన్ల సిబ్బందికి ఎన్నికల విధి విధానాలను వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాలన్నారు. ఏ పార్టీల వారికి అనుకూలంగా వ్యవహరించవద్దని తెలిపారు. విధుల్లో ఎక్కడా అలసత్వం వహించకుండా గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలను, సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీ సు ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కైకలూరు టౌన్, రూరల్ సీఐ లు ఆకుల రఘు, కృష్ణకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఏఏని వ్యతిరేకించండి- హరనాథ్

చాట్రాయి, మార్చి 14: కేంద్రంలోని బీజేపీ సర్కార్ అమలులోకి తెచ్చిన ఉమ్మడి పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నందున తక్షణం నిలిపి వేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇది భారత రాజ్యాంగానికి, ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు పూర్తి విరుద్ధమైనదని ఆందోళన వ్యక్తంచేశారు.

ఆలయ హుండీ లెక్కింపు

ముదినేపల్లి రూరల్, మార్చి 14 : సింగరాయపాలెం శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో 63 రోజులకు హుండీలను లెక్కించగా రూ.8,90,333 వెండి, 580 గ్రాములు, ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నేల సంధ్య తెలిపారు.